

'చెప్పాం-చేస్తున్నాం' అన్న మాటకు నిలువెత్తు నిదర్శనం కూటమి ప్రభుత్వం. చంద్రబాబు నాయకత్వంలో సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యతతో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తోంది. వైసీపీ పాలన నష్టాల నుంచి రాష్ట్రాన్ని గట్టెక్కిస్తున్న కూటమికి స్థానిక ఎన్నికల్లో ప్రజలు అండగా నిలవాలి.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**


గురువారం 29.10.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 188 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00




# క్షణ క్షణం పర్యవేక్షణ

## 32 వేల మందితో సీఎం భారీ టెలీకాన్ఫరెన్స్

- అర్నబ్ తుఫాన్‌పై చంద్రబాబు నిరంతర సమీక్ష
- ఇప్పటివరకు ప్రాణనష్టం లేదని ప్రభుత్వం వెల్లడి
- సహాయక, పునరుద్ధరణ చర్యల్లో మంత్రులు, అధికార యంత్రాంగం

**అమరావతి, అక్టోబర్ 28 (జర్నలిస్ట్ ఫైల్) :** అర్నబ్ తుఫాన్ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు, నిరంతర పర్యవేక్షణ, వేగవంతమైన సహాయక చర్యలపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రభుత్వం చేపట్టిన ముందస్తు చర్యలు, క్షేత్రస్థాయిలో అధికారుల తక్షణ స్పందన సానుకూల ఫలితాలను ఇస్తున్నాయని ప్రభుత్వం తెలిపింది. ఇప్పటివరకు ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని వెల్లడించింది.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తుఫాన్ పరిస్థితులను రాత్రింబవళ్లు పర్యవేక్షిస్తూ జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందితో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రజల ప్రాణాలను కాపాడటం, నష్టాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించడం, అత్యవసర సేవలను త్వరగా పునరుద్ధరించడం లక్ష్యంగా అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేస్తున్నారు.

**ఆర్‌టీజీఎస్ ద్వారా పరిస్థితిపై నిఘా :** సచివాలయానికి చేరుకున్న అనంతరం చంద్రబాబు రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్‌టీజీఎస్) కేంద్రంలో తుఫాన్ ప్రభావిత జిల్లాల్లోని సీసీటీవీ కెమెరాల ద్వారా అందుతున్న ప్రత్యక్ష దృశ్యాలను పరిశీలించారు. తుఫాన్ కదలికలు, ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులు, ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులు, క్షణ

మిగతా 2లో...



# తుఫాను బాధితులకు తక్షణ సాయం

- ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించగలిగాం
- అర్హులకు గురువారం నుంచే ఆర్థిక సాయం
- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం
- నష్టంపై రేపు కేంద్రానికి ప్రాథమిక నివేదిక

2లో

**ఆర్టీజీఎస్ కేంద్రంలో సీఎం చంద్రబాబు వెల్లడి**

## క్షేత్రస్థాయిలోనే యంత్రాంగం

- తుపాను ప్రభావం తగ్గినా అప్రమత్తత వీడొద్దు
- రహదారులు, విద్యుత్ వ్యవస్థను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలి
- ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి
- అధికారులకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** అర్నబ్ తీవ్ర తుపాను తీరం దాటిన నేపథ్యంలో యంత్రాంగం మరింత అప్రమత్తతో వ్యవహరించాలని, తుపాను ప్రభావం పూర్తిగా తగ్గేంత వరకు అధికారులంతా క్షేత్ర స్థాయి విధుల్లోనే నిమఘ్నం కావాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాపట్ల నుంచి శ్రీకాకుళం వరకు తుపాను ప్రభావం ఉన్న అన్ని జిల్లాల కలెక్టర్లతోనూ ఆయా జిల్లాలలో తాజా పరిస్థితిపై బుధవారం మధ్యాహ్నం సమీక్షించారు.

ముఖ్యంగా తుపాను తీరం దాటిన డా. బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అంతర్వేది పరిసర ప్రాంతాలు, కాకినాడ జిల్లాలోని తీర ప్రాంతంలో పరిస్థితులు, తుపాను తాకిడికి సంభవించిన నష్టం తదితర అంశాలపై ఆరా తీశారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని, సహాయక చర్యలను మరింత పకడ్బందీగా చేయాలని ఉప ముఖ్యమంత్రి అధికారులకు ఆదేశించారు. తుపాను ప్రభావం తగ్గుముఖం పట్టాక పంట నష్టం వివరాలను పారదర్శకంగా నమోదు చేయాలని దిశా నిర్దేశం చేశారు. ఉప్పాడ తీర ప్రాంతంలో నిర్మించిన రోడ్డు పూర్తిగా దెబ్బతిన్న అంశాన్ని ప్రస్తావించి వివరాలు తెలుసుకున్నారు. ఉప్పాడ తీరం వెంబడి ఇళ్లు ఏమైనా దెబ్బతిన్నాయా అన్న అంశాలు ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. ఆస్తి నష్టం, పంట నష్టం, పునరావాస కేంద్రాల నిర్వహణ, దెబ్బతిన్న సౌకర్యాల పునరుద్ధరణ తదితర అంశాలపై పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం చేశారు.

మిగతా 2లో...

## ప్రాజెక్టులపై ప్రధాని ప్రత్యేక దృష్టి

- రాష్ట్రాల వారీగా ప్రగతి పనులపై సమీక్ష
- భూసేకరణను నవంబర్, డిసెంబరులో పూర్తి చేస్తాం
- బల్క్ డ్రగ్ పార్కు పనులు వేగవంతం చేయాలి
- విశాఖ ఏక్తా మాల్‌ను గడువులోగా పూర్తి చేయాలని సూచన



**అమరావతి, అక్టోబర్ 28 (జర్నలిస్ట్ ఫైల్) :** వివిధ ప్రగతి ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశించారు. ప్రగతి కార్యక్రమంలో భాగంగా వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో బుధవారం ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ప్రధానమంత్రి, ఆయా రాష్ట్రాల్లో కొనసాగుతున్న కీలక ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు.

ఎర్రుపాలెం-అమరావతి-నంబూరు రైల్వే కనెక్టివిటీ, పీఎం ఏక్తా మాల్స్, బల్క్ డ్రగ్ పార్కుల అభివృద్ధి, పీఎం సేతు సహా ఐటీఐ ఎకోసిస్టమ్

మిగతా 3లో...

## ఎంపీటీసీ, జెడ్పీటీసీ షెడ్యూల్ మార్పు



- నవంబరు 5న పోలింగ్.. 7న ఫలితాలు
- 6న రీపోలింగ్ నిర్వహణ
- పట్టణ ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో నిర్ణయం

3లో

## విద్యుత్ పునరుద్ధరణ వేగవంతం

- 857 గ్రామాల్లో 707 గ్రామాలకు సరఫరా పునరుద్ధరణ
- మిగిలిన గ్రామాల్లో రాత్రికి విద్యుత్ అందించేలా చర్యలు
- 399 ప్రత్యేక బృందాలతో యుద్ధప్రాతిపదికన పనులు
- విద్యుత్ వ్యవస్థకు రూ.1.57 కోట్ల నష్టం

3లో

## తుపాను వేళ తోడుగా తెలంగాణ

- విద్యుత్ సిబ్బంది, సామగ్రి పంపేందుకు సిద్ధం
- మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు భట్టి విక్రమార్క ఫోన్
- తెలంగాణ ప్రభుత్వానికి గొట్టిపాటి కృతజ్ఞతలు

## నెట్‌వర్క్ ఆసుపత్రులకు రూ.185 కోట్ల చెల్లింపులు




- ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు సీఈఓ వెల్లడి

3లో

## రైతులకు అండగా నిలవండి

- పంట నష్ట నివారణకు యుద్ధప్రాతిపదికన చర్యలు
- పంటల పునరుద్ధరణపై ప్రత్యేక దృష్టి
- క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టం అంచనాలు వేయాలి
- అర్హులైన రైతులకు సకాలంలో సాయం అందించాలి
- వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాలు



**అమరావతి, అక్టోబర్ 28 (జర్నలిస్ట్ ఫైల్) :** ఆర్నాబ్ తుఫాను నేపథ్యంలో పంట నష్టాన్ని సాధ్యమైనంత వరకు నివారించడంతో పాటు రైతులకు అండగా నిలిచేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. బుధవారం వ్యవసాయ, ఉద్యానవన శాఖల ఉన్నతాధికారులు, జిల్లా స్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి పంటల సంరక్షణ, పునరుద్ధరణ, సహాయక చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామస్థాయి వ్యవసాయ సహాయకుడి నుంచి రాష్ట్రస్థాయి

మిగతా 3లో...



## తుపాను నష్టంపై తక్షణ కార్యాచరణ

- దెబ్బతిన్న రహదారులు, కల్వర్టుల పునరుద్ధరణకు చర్యలు
- తాత్కాలిక పనులకు రూ.9.18 కోట్లు
- శాశ్వత మరమ్మతులకు రూ.50.27 కోట్లు
- క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణకు మంత్రి ఆదేశం

3లో

## మునిసిపల్ శాఖ అప్రమత్తం

- తుపాను వేళ పట్టణాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగొద్దు
- రోడ్లపై చెట్లు, డ్రెయిన్లలో నీరు నిలవకుండా చర్యలు
- ప్రమాదకర హోర్డింగ్‌ల వద్ద భద్రతా ఏర్పాట్లు
- పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి
- కమిషనర్లతో మంత్రి నారాయణ టెలీకాన్ఫరెన్స్



3లో

**అమరావతి, అక్టోబర్ 28 (జర్నలిస్ట్ ఫైల్) :** అర్నబ్ తుపాన్ ప్రభావంతో పట్టణ ప్రాంతాల్లో జనజీవనానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ ఆదేశించారు. తుపాన్ ప్రభావిత మునిసిపాలిటీల కమిషనర్లతో మంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి పట్టణాల్లో పరిస్థితులు, సహాయక చర్యలు, పారిశుధ్య నిర్వహణ, రహదారుల పరిస్థితిపై సమీక్షించారు.

తుపాన్ కారణంగా పట్టణాల్లో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, సమస్యలు తలెత్తిన వెంటనే స్పందించేలా మునిసిపల్ యంత్రాంగం సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

## అర్నబ్ బలహీనం.. అప్రమత్తం



- తుపాను తీవ్రత తగ్గినా వర్షాలు కొనసాగే అవకాశం
- ఉత్తరాంధ్రలో భారీ వర్షాలకు వాతావరణ శాఖ అంచనా
- తీరంలో గంటకు 50 కి.మీ. వరకు గాలులు
- లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచన

3లో

# క్షేత్రస్థాయిలోనే యంత్రాంగం



(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా అధికారులు తుపాను పరిస్థితిని వివరిస్తూ... అర్ధరాత్రి 1.20 నుంచి యానాంకు దక్షిణంగా అర్నబ్ తుపాను తీరం దాటే ప్రక్రియ ప్రారంభమై, ఉదయం వరకు కొనసాగింది. ఈ సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. గరిష్ఠంగా 140 కిలోమీటర్ల వేగాన్ని చేరుకున్నాయని వివరించారు. బాపట్ల, కృష్ణా, పశ్చిమ గోదావరి, కోనసీమ, కాకినాడ, తూర్పు గోదావరి, అనకాపల్లి, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం తదితర జిల్లాల్లోనూ పెనుగాలులు విధ్వంసం సృష్టించాయని, గాలులు తాకిడికి భారీ వృక్షాలు రోడ్లపై కూలి రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని తెలిపారు. విద్యుత్ స్థంభాలు కూలడం, వైర్లు తెగిపోవడం కారణంగా ఆయా జిల్లాల పరిధిలో విద్యుత్ సరఫరా దాదాపు నిలిపివేసినట్టు చెప్పారు. గుంటూరు, ఎన్టీఆర్, ఏలూరు, పోలవరంతో పాటు ఏజెన్సీ జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నట్టు వివరించారు. గాలుల తీవ్రత తగ్గుముఖం పట్టిన ప్రాంతాల్లో తక్షణం విద్యుత్ సరఫరా పునరుద్ధరణ, రోడ్లపై పడిన చెట్ల తొలగింపు తదితర కార్యక్రమాలు చేపడుతున్నామనీ, తీర ప్రాంత గ్రామాల ప్రజలు పునరావాస కేంద్రాల్లో సురక్షితంగా ఉన్నట్టు కలెక్టర్లు తెలిపారు. జిల్లాల వారీగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంల ద్వారా సహాయక చర్యల పర్యవేక్షణ, పునరుద్ధరణ కొనసాగుతున్నట్టు తెలిపారు.

ఒక్క తూర్పు గోదావరి జిల్లా పరిధిలోనే 93 రోడ్లు దెబ్బతిన్నాయి. దాదాపు 736 చెట్లు నేలకొరిగినట్టు సమాచారం ఉంది. యుద్ధప్రాతిపదికన వాటిని తొలగించే ప్రయత్నం చేయాలని సూచనలు చేశారు. వాగులు, వంకల్లో ప్రవాహాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ, ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు.

మధ్యాహ్నానికి కాకినాడ పరిసరాల్లో ఉన్న తుపాను ఉత్తరాంధ్ర మీదుగా కదలాడుతూ క్రమంగా బలపడుతున్నట్టు వాతావరణ నివేదికలు చెబుతున్నాయి. తుపాను ప్రభావం తగ్గినా భారీ వర్షాలు, బలమైన గాలులు కొనసాగే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు, పారిశుధ్య నిర్వహణలో లోపాలు లేకుండా చేసుకోవాలని ఆదేశించారు. గాలులు తీవ్రత పూర్తిగా తగ్గి, వర్షాలు తగ్గుముఖం పట్టిన తర్వాత పునరావాస కేంద్రాల నుంచి ప్రజలను ఇళ్లకు పంపాలని స్పష్టం చేశారు.

నీటి నిల్వలను తక్షణం తొలగించాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో క్లోరినేషన్, బ్లీచింగ్ చల్లడం ద్వారా అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తక్షణం పంట నష్టంపై సమగ్ర అంచనాలు రూపొందించి, ప్రభుత్వానికి పంపాలని, రైతులకు సకాలంలో పరిహారం అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

గ్రామీణ ప్రాంతంలో దెబ్బతిన్న రహదారుల పునరుద్ధరణ ప్రక్రియ ప్రారంభించాలని, ముఖ్యంగా ఆసుపత్రులు, పునరావాస కేంద్రాలకు వెళ్లే మార్గాల్లో ఎలాంటి అడ్డంకులు లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించి, విద్యుత్ సరఫరాలో ఆటంకాలు లేకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. మొత్తం నష్టం తాలూకు నివేదికను సిద్ధం చేయాలని ఆదేశించారు.

**కాకినాడ జిల్లాలో పరిస్థితులపై...** : కాకినాడ జిల్లా పరిధిలో 92 ఆవాసాలు తుపానుకు ప్రభావితం కాగా, అందులో 9,870 మందికి పునరావాస శిబిరాల్లో ఆశ్రయం కల్పించినట్టు అధికారులు వివరించారు. పిఠాపురం నియోజకవర్గంలోని మండలాల్లో పరిస్థితులను ఉప ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. బీచ్ రోడ్డు ఎంత మేర దెబ్బతింది. అలల తీవ్రత ఏ మేరకు ఉంది లాంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిఠాపురం నియోజకవర్గం పరిధిలో ఏలేరు ముంపు పరిస్థితిపై వివరాలు అడిగారు. ఏలేరు దిగువ ప్రాంతాల ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తెలిపారు. కాకినాడ జిల్లా, పిఠాపురం నియోజకవర్గాల పరిధిలో శాఖల వారీగా చేపట్టిన సహాయక చర్యలపై ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించాలని కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు.

ప్రజలు అధికారుల సూచనలు పాటిస్తూ మరో రెండు రోజుల పాటు అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు ఉప ముఖ్యమంత్రి సూచించారు. వాతావరణ శాఖ అనుమతులు వచ్చే వరకు మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా అందిన సమాచారం మేరకు 14 జిల్లాలపై తుపాను ప్రభావం తీవ్రంగా ఉందని, ఆయా జిల్లాల పరిధిలో దాదాపు 28,000 మందికి పైగా బాధితులను పునరావాస శిబిరాలకు తరలించడం జరిగిందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ప్రాథమిక అంచనాల ప్రకారం 70,000 హెక్టార్లలో పంటలు నీట మునిగినట్టు సమాచారం ఉందనీ.. మరో 10,500 హెక్టార్లలో ఉద్యాన పంటలు, పెద్ద ఎత్తున ఇళ్లు, రహదారులు, విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయని చెప్పారు. 16 ఎన్డీఆర్ఎఫ్, 11 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యల్లో నిమగ్నమయ్యాయి అన్నారు. వీరితో పాటు దాదాపు 32,000 మంది వివిధ శాఖలకు చెందిన సిబ్బంది క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ముందస్తు సహాయక చర్యలు చేపట్టి, ప్రాణనష్టాన్ని నివారించగలిగాము అన్నారు.

# అర్నబ్ బలహీనం.. అప్రమత్తం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** బంగాళాఖాతంలో తీవ్ర ఆందోళనకు గురిచేసిన 'అర్నబ్' తుపాను క్రమంగా బలహీనపడుతోంది. అతి తీవ్ర తుపాను స్థాయి నుంచి సాధారణ తుపానుగా మారిన ఇది బుధవారం రాత్రికి మరింత బలహీనపడి తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

తుపాను బలహీనపడుతున్నప్పటికీ దాని ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కొనసాగే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. ముఖ్యంగా ఉత్తరాంధ్ర జిల్లాల్లో వర్షాల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అంచనా వేశారు.

శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో గురువారం ఒకటి, రెండు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నమోదయ్యే అవకాశముంది.

తుపాను ప్రభావంతో తీర ప్రాంతాల్లో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముండటంతో మత్స్యకారులు, తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

భారీ వర్షాల కారణంగా కొండ ప్రాంతాలు, వాగులు, లోతట్టు ప్రాంతాల్లో ఆకస్మిక వరదలు సంభవించే ప్రమాదం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఇప్పటికే నీటిముంపునకు గురయ్యే ప్రాంతాల్లో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

తుపాను తీవ్రత తగ్గుతున్నప్పటికీ పూర్తిగా ప్రభావం నుంచి బయటపడే వం-కు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు. అత్యవసర పరిస్థితుల్లో అధికార యంత్రాంగం సూచనలు పాటిస్తూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

# క్షణ క్షణం పర్యవేక్షణ



(మొదటి పేజీ తరువాయి)

సహాయక, పునరుద్ధరణ చర్యలపై ఆర్టీజీఎస్ అధికారులు ముఖ్యమంత్రికి ఎప్పటికప్పుడు వివరాలు అందించారు.

తుఫాన్ హెచ్చరికలు జారీ చేసినప్పటి నుంచి ఆర్టీజీఎస్ ద్వారా పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు ఐటీ కార్యదర్శి కాటంనేని భాస్కర్ ముఖ్యమంత్రికి వివరించారు. క్షేత్రస్థాయిలో తలెత్తుతున్న సమస్యలను వేగంగా గుర్తించి సంబంధిత శాఖలకు సమాచారం అందిస్తున్నట్లు తెలిపారు.

**32 వేల మందితో భారీ టెలీకాన్ఫరెన్స్** : తుఫాన్ ప్రభావంపై సమన్వయ చర్యల్లో భాగంగా ముఖ్యమంత్రి సుమారు 32 వేల మంది అధికారులు, సిబ్బందితో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ల నుంచి గ్రామస్థాయి సిబ్బంది వరకు అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఇంధన, జలవనరులు, రోడ్లు-భవనాలు, వ్యవసాయం, పురపాలక పరిపాలన, పంచాయతీరాజ్ శాఖల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ఆయా శాఖల పరిధిలో చేపట్టిన ముందస్తు చర్యలు, తుఫాన్ ప్రభావం, పునరుద్ధరణ పనులపై వివరాలు తెలుసుకున్నారు.

**క్షేత్రస్థాయిలో మంత్రుల పర్యవేక్షణ** : తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో మంత్రులు స్వయంగా పర్యటిస్తూ సహాయక, పునరుద్ధరణ చర్యలను పర్యవేక్షిస్తున్నారు. అధికారులు, అత్యవసర స్పందన బృందాలు, క్షేత్రస్థాయి సిబ్బంది భారీ వర్షంలోనూ రాత్రంతా విధులు నిర్వహిస్తున్నారు. ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు శాఖల మధ్య సమన్వయంతో చర్యలు చేపడుతున్నారు.

**రెండు గంటల్లో చెట్లు తొలగించాలని ఆదేశం** : తుఫాన్ కారణంగా రహదారులపై నేలకొరిగిన చెట్లను రెండు గంటల్లోగా తొలగించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ముఖ్యంగా జాతీయ రహదారులపై ఏర్పడిన అడ్డంకులను వెంటనే తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని సూచించారు.

రోడ్లపై చెట్లు, విద్యుత్ స్తంభాలు పడిపోవడం, రహదారులు మూసుకుపోవడం వంటి సమస్యలపై అధికారులు తక్షణమే స్పందిస్తున్నారు. ప్రభావిత ప్రాంతాల్లో అత్యవసర సేవలకు ఆటంకం కలగకుండా రహదారులను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు కొనసాగుతున్నాయి.

**విద్యుత్ పునరుద్ధరణకు ప్రత్యేక చర్యలు** : తుఫాన్ ప్రభావంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిన ప్రాంతాల్లో పునరుద్ధరణ చర్యలు చేపడుతున్నారు. అవసరమైన పరికరాలు, సామగ్రిని ముందుగానే సిద్ధంగా ఉంచినట్లు ప్రభుత్వం తెలిపింది. గాలుల తీవ్రత తగ్గి పరిస్థితులు అనుకూలంగా ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నారు.

ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రమాదకర పరిస్థితుల్లో విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టకుండా, పరిస్థితులు అనుకూలించిన వెంటనే సరఫరాను పునరుద్ధరించాలని అధికారులకు సూచించారు.

**ఫిర్యాదులపై తక్షణ స్పందన** : 'మన మిత్ర' ప్లాట్‌ఫాం, వాట్సాప్, సోషల్ మీడియా, మీడియా కథనాలు, కంట్రోల్ రూమ్‌ల ద్వారా ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులను సంబంధిత శాఖలకు పంపిస్తున్నారు. ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారులు పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

ఫిర్యాదు పరిష్కారమైన అనంతరం సంబంధిత వ్యక్తికి సమాచారం అందించాలని కూడా అధికారులకు సూచించారు. ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా అధికార యంత్రాంగం తక్షణమే స్పందించేలా వ్యవస్థను అప్రమత్తంగా ఉంచారు.

**పునరావాస కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు** : తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ఆహారం, తాగునీరు, వైద్య సేవలకు ఎలాంటి కొరత లేకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అవసరమైన మందులు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు.

పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు, వారి అవసరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

**పంటల రక్షణపై ప్రత్యేక దృష్టి** : తుఫాన్ ప్రభావంతో వ్యవసాయ, ఉద్యాన పంటలకు నష్టం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. దెబ్బతిన్న పంటలపై క్షేత్రస్థాయిలో ప్రాథమిక అంచనాలు రూపొందించాలని వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులను ఆదేశించారు.

చెరువులు, కాలువలకు గండ్లు పడకుండా పర్యవేక్షించాలని, నీటి ప్రవాహాన్ని నిరంతరం పరిశీలించాలని జలవనరుల శాఖ అధికారులకు సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధం**: అత్యవసర పరిస్థితులు ఏర్పడితే వెంటనే స్పందించేందుకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అవసరమైన పరికరాలు, రక్షణ సామగ్రితో బృందాలను ప్రభావిత ప్రాంతాలకు సమీపంలో అందుబాటులో ఉంచాలని సూచించారు.

ప్రాణనష్టం జరగకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, పరిస్థితి మరింత తీవ్రతరం అయ్యే ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**పంట నష్టంపై కేంద్రానికి నివేదిక** : తుఫాన్ కారణంగా జరిగిన పంట నష్టంపై ప్రాథమిక అంచనాలను సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నష్టం అంచనాలను సమగ్రంగా నమోదు చేయాలని సూచించారు.

**సాధారణ పరిస్థితులు వచ్చే వరకు అప్రమత్తత** : ప్రజల ప్రతి ఒక్కరి ప్రాణాలను రక్షించడం, ఆస్తి నష్టాన్ని తగ్గించడం, అత్యవసర సేవలను పునరుద్ధరించడం ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్యాలని చంద్రబాబు స్పష్టం చేశారు. తుఫాన్ ప్రభావం పూర్తిగా తగ్గి సాధారణ పరిస్థితులు నెలకొనే వం-కు అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

ప్రజల్లో భయాందోళనలు కలగకుండా వాస్తవ పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలియజేయాలని, ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ధైర్యం కల్పించాలని సూచించారు. ప్రతి ప్రజా ఫిర్యాదుపై వేగంగా స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మంత్రులు క్షేత్రస్థాయిలో సహాయక చర్యలను పర్యవేక్షిస్తుండగా, అధికారులు, అత్యవసర స్పందన బృందాలు, పారిశుధ్య, విద్యుత్, రోడ్లు, రెవెన్యూ, వైద్య, వ్యవసాయ శాఖల సిబ్బంది నిరంతరం విధుల్లో ఉన్నారు. ముఖ్యమంత్రి ఆర్టీజీఎస్ కేంద్రం ద్వారా పరిస్థితిని పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట తక్షణ చర్యలకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులు పూర్తిగా సాధారణ స్థితికి వచ్చే వరకు ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తుందని ప్రభుత్వం వెల్లడించింది.

# తుఫాను బాధితులకు తక్షణ సాయం



**అమరావతి, అక్టోబరు 28 (జర్నలిస్ట్ ఫైల్) :** అర్నబ్ తుఫాను ప్రభావాన్ని ముందుగానే అంచనా వేస్తూ, మూడు రోజుల్లో ఏడు సమీక్షలు నిర్వహించి, అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాన్ని గణనీయంగా తగ్గించ గలిగామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. రియల్ టైమ్ గవర్నెన్స్ సెంటర్ ద్వారా తుఫాను గమనాన్ని నిరంతరం పర్యవేక్షించడంతో పాటు, జిల్లా కలెక్టర్లు, క్షేత్రస్థాయి అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించామని చెప్పారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు ప్రభుత్వం విశ్రాంతి తీసుకోదని స్పష్టం చేశారు. రియల్ టైమ్ గవర్నెన్స్ సెంటర్ నుంచి నిర్వహించిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. తుఫాను కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలకు అత్యంత ప్రాధాన్యమిచ్చామని తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల వరకు అధికారులు, సిబ్బంది రాత్రింబవళ్లు పనిచేశారని పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు, షెల్టర్ క్యాంపులకు తరలించడంతో పాటు, వారికి అవసరమైన సదుపాయాలు కల్పించామని చెప్పారు. రెస్క్యూ, రిలీఫ్ కార్యక్రమాలు పూర్తిస్థాయిలో కొనసాగుతున్నాయని సీఎం తెలిపారు. పంట నష్టాన్ని మినహాయించి, ఇతర నష్టాలకు సంబంధించి అర్హులైన బాధితులకు గురువారం నుంచే ఆర్థిక సాయం అందించేలా చర్యలు చేపడతామని చెప్పారు. ఈ అంశంపై గురువారం వర్చువల్ కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. తుఫాను వల్ల జరిగిన నష్టంపై ప్రాథమిక అంచనాలను కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. ఈ మేరకు కేంద్రానికి లేఖ రాయడంతో పాటు కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో ఫోన్‌లో మాట్లాడి తుఫాను తీవ్రత, రాష్ట్రంపై దాని ప్రభావాన్ని వివరించినట్లు చెప్పారు. కొబ్బరి, ఇతర ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లిందని, సమగ్ర నష్ట నివేదికను కూడా త్వరలోనే కేంద్రానికి పంపిస్తామని వెల్లడించారు.

**సాంకేతికతతో కచ్చితమైన అంచనాలు** : తుఫాను ప్రభావంతో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేల కూలాయని, పలు ప్రాంతాల్లో ఆస్తి నష్టం జరిగిందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 15 వేల విద్యుత్ స్తంభాలు కూలిపోయినట్లు తెలిపారు. కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలు మినహా మిగతా జిల్లాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామని పేర్కొన్నారు. ఈ రెండు జిల్లాల్లోనూ ఎల్లుండి సాయంత్రానికి విద్యుత్ సరఫరాను పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తామని వెల్లడించారు. రాష్ట్ర రహదారులు, రహదారుల పై రాకపోకలను బుధవారం రాత్రికే పునరుద్ధరణకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రభావిత ప్రాంతాల్లో తాగునీరు, పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో ఆహారం, ఔషధాలు అందించేందుకు డ్రోన్లను కూడా సిద్ధం చేశామని వివరించారు. గతంలో తుఫాను హెచ్చరికలు వచ్చినప్పుడు శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాల్సి వచ్చేదని సీఎం గుర్తుచేశారు. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో తుఫాను ప్రభావం ఏయే ప్రాంతాల్లో ఎక్కువగా ఉంటుందో ముందుగానే గుర్తించి, అక్కడే అధికార యంత్రాంగాన్ని మోహరిస్తున్నామని వివరించారు. ప్రిడిక్షన్, యాక్యురెసీ, క్షేత్రస్థాయిలో అప్రమత్తత అనే విధానాలతో విపత్తును ఎదుర్కొంటున్నామని తెలిపారు. ఐఎండీ సమాచారం, ఉపగ్రహ ఛాయాచిత్రాలను ఎప్పటికప్పుడు విశ్లేషిస్తూ తుఫాను గమనాన్ని అంచనా వేశామని చెప్పారు. సముద్రంలో నెలకొన్న వివిధ వాతావరణ పరిస్థితుల కారణంగా తుఫాను ఏపీ తీరంపై సుమారు 10 గంటలపాటు నిలిచిపోయిందని, తీరం దాటే సమయంలో గరిష్ఠంగా గంటకు 150 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయని వెల్లడించారు. సుమారు 30 వేల మంది క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందితో టెలి కాన్ఫరెన్సుల ద్వారా నిరంతరం సమన్వయం చేసుకున్నామని తెలిపారు.

**మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం** : తుఫాను ప్రభావంతో విశాఖపట్నంలో విద్యుత్‌పై చెట్టు కూలిన ఘటనలో ఇద్దరు, అనకాపల్లిలో ఒకరు, కోనసీమలో ఒకరు, భీమవరంలో మరొకరు ప్రాణాలు కోల్పోయారని ముఖ్యమంత్రి తెలిపారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున పరిహారం అందిస్తామని ప్రకటించారు. తుఫాను కారణంగా ఇళ్లు, పంటలు, దుకాణాలు, ఇతర ఆస్తులు నష్టపోయిన వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ముఖ్యమంత్రి తెలిపారు. ముంపు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరిన బాధితులకు 25 కిలోల బియ్యం అందించాలని ఆదేశించినట్లు చెప్పారు. చేనేత కార్మికులు, మత్స్యకారులకు 50 కిలోల బియ్యంతో పాటు కిలో చొప్పున ఉల్లి, వంటనూనె, కందిపప్పు అందిస్తామని ప్రకటించారు. షెల్టర్ క్యాంపుల్లో ఆశ్రయం పొందిన వారికి రూ. 1,000 చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. ఉద్యాన పంటలకు సంబంధించి అరటి పంటకు హెక్టారుకు రూ. 35,000, టమాటాకు రూ. 25,000 చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. పత్తి, చెరకు తదితర పంటలకు హెక్టారుకు రూ. 25,000 చొప్పున సాయం అందించే అంశాన్ని వెల్లడించారు. ఇతర పంటలకు నష్టం కేటగిరీల వారీగా పరిహారం అందిస్తామని చెప్పారు. వ్యవసాయ, ఉద్యాన పంటల నష్టాన్ని ఎన్యుమరేషన్ ద్వారా అంచనా వేసి రైతులను ఆదుకుంటామని తెలిపారు.

**ప్రభావిత ప్రాంతంలో క్షేత్రస్థాయి పర్యటన** : అర్నబ్ తుఫాను కారణంగా రాష్ట్రంలో వర్షపాతం పెరిగిందని సీఎం తెలిపారు. రాష్ట్ర సగటు లోటు వర్షపాతం 39 శాతం నుంచి 27 శాతానికి తగ్గిందని చెప్పారు. విశాఖపట్నంలో 21 సెంటీమీటర్లు, విజయనగరంలో 18 సెంటీమీటర్లు, శ్రీకాకుళం జిల్లాలో 14 సెంటీమీటర్లు, కృష్ణా జిల్లాలో 9 సెంటీమీటర్ల మేర వర్షపాతం నమోదైందని వివరించారు. శ్రీకాకుళం నుంచి కృష్ణా జిల్లా వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయని పేర్కొన్నారు. వర్షపు నీటిని సమర్థంగా వినియోగించుకునేందుకు ముందుగానే ప్రణాళికలు సిద్ధం చేశామని, ఏ చెరువును నింపాలి, ఏ రిజర్వాయర్‌లోకి నీటిని మళ్లించాలన్న అంశాలపై కార్యాచరణ రూపొందించామని తెలిపారు. ముందస్తు చర్యలు, కాలువల్లో అడ్డంకులను తొలగించడం వల్ల రాష్ట్రవ్యాప్తంగా ఒక్క చెరువుకు కూడా గండి పడలేదని చెప్పారు. శ్రీకాకుళం, మన్యం జిల్లాల్లో మరికొంత వర్షం కురిసే అవకాశం ఉన్నందున అక్కడి ప్రజలను అప్రమత్తం చేశామని వెల్లడించారు. గత మూడు రోజులుగా నిరంతరం పనిచేసిన అధికారులు, జిల్లా కలెక్టర్లు, క్షేత్రస్థాయి సిబ్బందిని ముఖ్యమంత్రి అభినందించారు. తాను, అధికారులు, సిబ్బంది రాత్రంతా నిద్ర లేకుండా ప్రజలకు సేవలందించామని చెప్పారు. ప్రభుత్వం ఇచ్చిన సూచనలను పాటిస్తూ ప్రజలు కూడా పూర్తిస్థాయిలో సహకరించారని పేర్కొన్నారు. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు అధికారులు క్షేత్రస్థాయిలోనే ఉండి సహాయక చర్యలను కొనసాగించాలని సూచించారు. గురువారం స్వయంగా ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి నష్టాన్ని పరిశీలిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. బాధితులకు వేగంగా సహాయం అందించి, ప్రజల్లో భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

# నెతన్యాహుకు ఎదురుగాలి..

జెరుసలాం: ఇజ్రాయిల్ సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ ముగిసింది. ప్రస్తుతం ఓట్ల లెక్కింపు జరుగుతోంది. ఎగ్జిట్ పోల్స్ ప్రకారం ప్రధాని బెంజమిన్ నెతన్యాహూకు చెందిన లికుడ్ పార్టీకి గానీ, మాజీ సైనిక దళాల చీఫ్ గాడి ఐసెన్‌కోట్ నేతృత్వంలోని యాషర్ పార్టీకి గానీ సంపూర్ణ మెజారిటీ దక్కడం లేదు. నెతన్యాహూ పార్టీ బలం తగ్గే అవకాశం ఉందని అంచనా వేశారు. మంగళవారం జరిగిన ఎన్నికల్లో 85 శాతానికి పైగా ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సమయానికి ప్రధాని బెంజమిన్ నెతన్యాహు నేతృత్వంలోని కుడిపక్ష కూటమి స్వల్ప ఆధిక్యంలో ఉంది. అయితే, 120 స్థానాల పార్లమెంటులో మెజారిటీకి అవసరమైన 61 స్థానాలను సాధించే పరిస్థితి కనిపించడం లేదు. నెతన్యాహు కూటమికి 53, గాడి ఐసెన్‌కాట్ నేతృత్వంలోని ప్రతిపక్ష కూటమికి 48 స్థానాలు వస్తాయని అంచనా. తుది ఫలితాల్లో మార్పులు ఉండొచ్చని అధికారులు తెలిపారు. ఎగ్జిట్ పోల్స్ ప్రతిపక్ష యాషర్‌కు అనుకూలంగా రావడంతో టెల్ అవివ్‌లోని ఆ పార్టీ కార్యాలయం వద్ద కార్యకర్తలు భారీగా సంబరాలు చేసుకున్నారు. "బీబీ గో హోమ్" అంటూ నినాదాలు చేశారు. అరబ్ మెజారిటీ ఉన్న జాయింట్ లిస్ట్ నాయకుడు యూసుఫ్ జబరీన్ మాట్లాడుతూ, నెతన్యాహు ప్రభుత్వానికి నిజమైన ప్రత్యామ్నాయం చూపాలనుకునే వారు తమతో చెప్పాలన్నారు.

# ఎంపీటీసీ, జెడ్పీటీసీ షెడ్యూల్ మార్పు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో తుఫాను ప్రభావిత పరిస్థితుల నేపథ్యంలో కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో చర్చించింది. పరిస్థితిని అంచనా వేసి, వారు ఇచ్చిన హామీలను పరిగణనలోకి తీసుకున్న అనంతరం పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్‌ను వాయిదా వేయాల్సిన అవసరం లేదని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈ మేరకు పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ నవంబర్ 1, 2026న యథావిధిగా నిర్వహించబడుతుంది.

రాష్ట్ర ఎన్నికల సంఘం 19.10.2026 న రాష్ట్రంలో రెండో సాధారణ ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం, పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాలను సంబంధిత రిటర్నింగ్ అధికారులు 27.10.2026 న మధ్యాహ్నం 3 గంటల తర్వాత ప్రచురించారు. అదే విధంగా, ఏకగ్రీవంగా ఎన్నికైన స్థానాల ఫలితాలను కూడా 27.10.2026న మధ్యాహ్నం 3 గంటల తర్వాత ప్రకటించారు.

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ఓట్ల లెక్కింపు నవంబర్ 3న జరగనుండగా, అదే రోజున ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ నిర్వహించాల్సి ఉంది. ఈ రెండు కార్యక్రమాలను ఒకే రోజు సమర్థవంతంగా నిర్వహించడానికి అవసరమైన పోలీసు సిబ్బంది, పోలింగ్ సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో ఎన్నికల షెడ్యూల్‌ను సవరించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది.

ఈ నేపథ్యంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ తేదీని నవంబర్ 3 నుంచి నవంబర్ 5, 2026కు, రీపోలింగ్ తేదీని నవంబర్ 4 నుంచి నవంబర్ 6కు, ఓట్ల లెక్కింపు మరియు ఫలితాల ప్రకటన తేదీని నవంబర్ 5 నుంచి నవంబర్ 7, 2026కు మారుస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం 28.10.2026న సవరించిన నోటిఫికేషన్ జారీ చేసింది.

**సవరించిన ఎన్నికల షెడ్యూల్** : రాష్ట్రంలోని మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు (ఎంపీటీసీ), జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల (జెడ్పీటీసీ) రెండో సాధారణ ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్‌ను ప్రకటించింది. పోలింగ్ 05.11.2026 ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, రీపోలింగ్ 06.11.2026 ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, ఓట్ల లెక్కింపు 07.11.2026 ఉదయం 8 గంటల నుంచి ఫలితాల ప్రకటన ఓట్ల లెక్కింపు పూర్తయిన వెంటనే ఉంటుందని తెలిపారు.

రాష్ట్ర ఎన్నికల సంఘం 20.10.2026 న జారీ చేసిన నోటిఫికేషన్ల ప్రకారం, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 10 మండలాల్లో 44 పోలింగ్ కేంద్రాలకు, పోలవరం జిల్లాలోని 7 మండలాల్లో 44 పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ ముగింపు సమయాన్ని సాయంత్రం 5 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలకు ముందుగానే నిర్ణయించింది.

అందువల్ల, ఈ 88 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ మరియు అవసరమైతే రీపోలింగ్ మధ్యాహ్నం 3 గంటలకే ముగుస్తాయి.

సవరించిన ఎన్నికల షెడ్యూల్‌పై విస్తృత ప్రచారం కల్పించాలని అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది.

# నెట్‌వర్క్ ఆసుపత్రులకు రూ.185 కోట్ల చెల్లింపులు

**అమరావతి, అక్టోబర్ 28 (జర్నలిస్ట్ ఫైల్) :** ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ద్వారా ప్రైవేటు నెట్‌వర్క్ ఆసుపత్రులకు ఈ నెలలో రూ. 185 కోట్ల చెల్లింపులు చేసినట్లు ట్రస్ట్ సీఈఓ పద్మావతి తెలిపారు. ఇందులో ఈహెచ్ఎస్ అనుబంధ ఆసుపత్రులకు రూ. 50 కోట్లు, వైద్య సేవ ఆసుపత్రులకు రూ. 122.64 కోట్లు, ప్రాధాన్య ఆసుపత్రులకు రూ. 12.54 కోట్లు చెల్లించినట్లు వెల్లడించారు. వీటితోపాటు అదనంగా బిల్లు డిస్కౌంట్ పథకం కింద పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు రూ. 144 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. దీంతో అక్టోబరు 2026లో మొత్తం రూ. 329 కోట్ల చెల్లింపులు జరిగినట్లు పేర్కొన్నారు.

## ప్రాజెక్టులపై ప్రధాని ప్రత్యేక దృష్టి



(మొదటి పేజీ తరువాయి)

వంటి అంశాలపై సమావేశంలో చర్చించారు. ప్రాజెక్టుల అమలులో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరిస్తూ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రధానమంత్రి సూచించారు.

**రైల్వే ప్రాజెక్టుకు భూసేకరణ వేగవంతం :** ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి ఎర్రుపాలెం–అమరావతి–నంబూరు రైల్వే లైన్ ప్రగతిని ప్రధానమంత్రి ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి రైల్వే శాఖకు అప్పగించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్‌ను ఆదేశించారు.

భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి నవంబర్, డిసెంబర్ నెలల్లో పూర్తి స్థాయిలో భూమిని సేకరించి రైల్వేకు అప్పగించేలా చర్యలు తీసుకుంటున్నామని సాయి ప్రసాద్ ప్రధానమంత్రికి వివరించారు.

**నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్కు పై దృష్టి :** అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ఏర్పాటు చేస్తున్న బల్క్ డ్రగ్ పార్కు పనుల పురోగతిని కూడా ప్రధానమంత్రి సమీక్షించారు. పార్కు ఏర్పాటుకు సంబంధించిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు.

నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుకు సంబంధించి చేపడుతున్న చర్యలు, ఇప్పటివరకు సాధించిన పురోగతిని సాయి ప్రసాద్ ప్రధానమంత్రికి వివరించారు.

**విశాఖ ఏక్తా మాల్ నిర్మాణంపై సమీక్ష :** విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తున్న పీఎం ఏక్తా మాల్ నిర్మాణానికి సంబంధించిన పురోగతిని కూడా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమీక్షించారు. ప్రాజెక్టు పనులను నిర్దేశిత కాలవ్యవధిలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

విశాఖపట్నం ఏక్తా మాల్ నిర్మాణానికి సంబంధించి చేపడుతున్న పనుల పురోగతిని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రధానమంత్రికి వివరించారు. వీడియో సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, ముఖ్య కార్యదర్శి జె.శ్యామల రావు, కార్యదర్శులు కోన శశిధర్, డా. ఎన్.యువరాజ్, ఏపీఐఐసీ ఎండీ దినేష్ కుమార్, సీఆర్డీఏ అదనపు కమిషనర్ భార్గవ్ తేజ్ తదితరులు పాల్గొన్నారు.

## తుపాను వేళ తోడుగా తెలంగాణ



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** అర్నబ్ తుపాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన నష్టం, విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలపై తెలంగాణ విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఆరా తీశారు. ఈ మేరకు ఏపీ ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు బుధవారం ఫోన్ చేసి పరిస్థితులను తెలుసుకున్నారు. తుపాను కారణంగా ఇప్పటివరకు జరిగిన నష్టం, ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు చేపట్టిన చర్యలను గొట్టిపాటి వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన నష్ట నివారణ, సహాయక చర్యలను ముమ్మరం చేసినట్లు తెలిపారు. విద్యుత్ వ్యవస్థకు జరిగిన నష్టాన్ని సరిచేస్తూ, సరఫరాను సాధారణ స్థితికి తీసుకొచ్చేందుకు అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని వివరించారు.

**పూర్తి సహకారం అందిస్తాం :** తుపాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనులకు అవసరమైన సిబ్బంది, సామగ్రిని పంపేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు పూర్తి స్థాయిలో సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. కష్టకాలంలో ఏపీకి అండగా నిలిచేందుకు ముందుకొచ్చిన తెలంగాణ ప్రభుత్వానికి గొట్టిపాటి రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు. విద్యుత్ పునరుద్ధరణ చర్యల్లో సహకారం అందించేందుకు సంసిద్ధత వ్యక్తం చేయడాన్ని అభినందించారు.

## మునిసిపల్ శాఖ అప్రమత్తం



(మొదటి పేజీ తరువాయి)

**రోడ్లపై చెట్లను వెంటనే తొలగించాలి:** ఈదురు గాలుల కారణంగా రోడ్లపై చెట్లు కూలిన ప్రాంతాల్లో వెంటనే వాటిని తొలగించాలని మంత్రి ఆదేశించారు. ఇందుకోసం అవసరమైన యంత్రాలు, సిబ్బందిని ముందుగానే సిద్ధంగా ఉంచి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చెట్లు కూలి రాకపోకలకు అంతరాయం ఏర్పడిన ప్రాంతాల్లో వేగంగా చర్యలు చేపట్టి ట్రాఫిక్‌ను పునరుద్ధరించాలని స్పష్టం చేశారు.

**ప్రమాదకర హోర్డింగ్‌లపై నిఘా :** తీవ్ర ఈదురుగాలుల నేపథ్యంలో ప్రమాదకరంగా ఉన్న హోర్డింగ్‌ల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ప్రజలకు, వాహనదారులకు ప్రమాదం కలగకుండా వాటి పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.

**డ్రెయిన్లలో నీరు నిల్వ లేకుండా చర్యలు :** భారీ వర్షాల నేపథ్యంలో రోడ్లపై, డ్రెయిన్లలో నీరు నిలిచిపోకుండా ఇంజినీరింగ్ సిబ్బంది తక్షణ చర్యలు చేపట్టాలని మంత్రి నారాయణ ఆదేశించారు. నీరు నిలిచిన ప్రాంతాలను గుర్తించి వెంటనే తొలగించాలని, అవసరమైన చోట మోటార్లు, ఇతర పరికరాలను వినియోగించాలని సూచించారు.

డ్రెయిన్లలో పూడిక, చెత్తాచెదారం పేరుకుపోయిన ప్రాంతాలను గుర్తించి వాటిని వెంటనే తొలగించాలని, వర్షపు నీరు సజావుగా వెళ్లేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

**పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి :** తుపాన్ అనంతరం పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా మునిసిపల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. వర్షపు నీరు కలుషితం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, నీటి నిల్వలు, చెత్త పేరుకుపోయిన ప్రాంతాల్లో అవసరమైన పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందేలా చూడాలని, నీరు కలుషితం అయ్యే అవకాశాలు ఉన్న ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. తుపాన్ ప్రభావం పూర్తిగా తగ్గే వరకు మునిసిపల్ యంత్రాంగం క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండి ప్రజలకు అవసరమైన సేవలను నిరంతరాయంగా అందించాలని ఆదేశించారు.

# తుపాను నష్టంపై తక్షణ కార్యాచరణ



**అమరావతి, అక్టోబర్ 28 (జర్నలిస్ట్ ఫైల్) :** అర్నబ్ తుఫాన్ ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా రహదారులు, మౌలిక వసతులకు భారీగా నష్టం వాటిల్లిందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 126.165 కిలోమీటర్ల మేర ఆర్‌అండ్‌బీ రహదారులు దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు వెల్లడించారు. దెబ్బతిన్న రహదారులు, ఇతర మౌలిక వసతులను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించే పనులు కొనసాగుతున్నాయని చెప్పారు.

తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న 9 కల్వర్టుల్లో ఇప్పటికే 6 కల్వర్టుల పునరుద్ధరణ పనులు పూర్తి చేసినట్లు మంత్రి తెలిపారు. రెండు ప్రాంతాల్లో రోడ్డు స్కార్లు ఏర్పడగా, ఒకచోట పునరుద్ధరణ పనులు పూర్తయ్యాయని వెల్లడించారు.

రాష్ట్రవ్యాప్తంగా రహదారులపై 1,058 చెట్లు నేలకొరిగినట్లు గుర్తించామని, వీటిలో ఇప్పటికే 859 చెట్లను తొలగించినట్లు మంత్రి తెలిపారు. చెట్లు, ఇతర అడ్డంకుల కారణంగా 57 ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడగా, 20 ప్రాంతాల్లో రాకపోకలను పునరుద్ధరించినట్లు వివరించారు.

**శ్రీకాకుళంలో అత్యధిక నష్టం :** జిల్లాల వారీగా చూస్తే శ్రీకాకుళం జిల్లాలో అత్యధికంగా 111.665 కిలోమీటర్ల మేర ఆర్‌అండ్‌బీ రహదారులు దెబ్బతిన్నట్లు మంత్రి తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలో 14.5 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నట్లు వెల్లడించారు.

దెబ్బతిన్న రహదారులు, కల్వర్టులు, ఇతర మౌలిక వసతుల పునరుద్ధరణకు మొత్తం రూ.59.45 కోట్లు అవసరమవుతాయని ప్రాథమికంగా అంచనా వేసినట్లు మంత్రి తెలిపారు. ఇందులో తాత్కాలిక పునరుద్ధరణ పనులకు రూ.9.18 కోట్లు, శాశ్వత పునరుద్ధరణ పనులకు రూ.50.27 కోట్లు అవసరమవుతాయని పేర్కొన్నారు.

జిల్లాల వారీగా పునరుద్ధరణకు అవసరమైన నిధుల అంచనాలను కూడా అధికారులు రూపొందించారు. తూర్పుగోదావరి జిల్లాలో పునరుద్ధరణకు అత్యధికంగా రూ.29.42 కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. శ్రీకాకుళం జిల్లాలో రూ.24.94 కోట్లు, విజయనగరం జిల్లాలో రూ.4.22 కోట్లు, పార్వతీపురం మన్యం జిల్లాలో రూ.86.30 లక్షలు అవసరమవుతాయని ప్రాథమికంగా అంచనా వేశారు.

**యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ :** తుఫాన్ కారణంగా రహదారులపై పడిన చెట్లు, కొమ్మలు, ఇతర అడ్డంకులను ఆర్‌అండ్‌బీ అధికారులు యుద్ధప్రాతిపదికన తొలగిస్తున్నారని మంత్రి తెలిపారు. రాకపోకలకు అంతరాయం ఏర్పడిన ప్రాంతాలను గుర్తించి, వీలైనంత త్వరగా రహదారులను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడిన ప్రాంతాల్లో రాకపోకలను వేగంగా పునరుద్ధరించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి స్పష్టం చేశారు.

**అప్రమత్తత కొనసాగించాలి:** తుఫాన్ ప్రభావం పూర్తిగా తగ్గే వరకు ఆర్‌అండ్‌బీ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆదేశించారు. రహదారులు, కల్వర్టులు, వంతెనలు, ఇతర మౌలిక వసతుల పరిస్థితిని నిరంతరం పరిశీలించాలని సూచించారు.

ప్రజల రాకపోకలకు ఎక్కడైనా అంతరాయం ఏర్పడితే వెంటనే స్పందించి తాత్కాలిక చర్యల ద్వారా మార్గాలను అందుబాటులోకి తీసుకురావాలని, అనంతరం శాశ్వత పునరుద్ధరణ పనులను చేపట్టాలని అధికారులకు సూచించారు. తుఫాన్ అనంతర పరిస్థితుల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా శాఖల మధ్య సమన్వయంతో వేగంగా చర్యలు చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు.

# విద్యుత్ పునరుద్ధరణ వేగవంతం



**విజయవాడ, అక్టోబర్ 28 (జర్నలిస్ట్ ఫైల్) :** ఆర్నాబ్ తుఫాన్ ప్రభావంతో ఏపీసీపీడీసీఎల్ పరిధిలోని పలు జిల్లాల్లో దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను పునరుద్ధరించేందుకు అధికారులు, సిబ్బంది యుద్ధప్రాతిపదికన చర్యలు చేపడుతున్నారు. దెబ్బతిన్న విద్యుత్ లైన్లు, స్తంభాలు, సబ్‌స్టేషన్లు, ఫీడర్లు, ఇతర పరికరాలకు మరమ్మతులు చేపడుతూ దశలవారీగా సరఫరాను పునరుద్ధరిస్తున్నారు.

బుధవారం సాయంత్రం 5 గంటల వరకు అందిన నివేదిక ప్రకారం తుఫాన్ ప్రభావంతో మొత్తం 857 గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడగా, 707 గ్రామాల్లో ఇప్పటికే సరఫరాను పునరుద్ధరించారు. మిగిలిన సుమారు 150 గ్రామాల్లో పునరుద్ధరణ పనులను బుధవారం రాత్రికి పూర్తి చేసి సరఫరా అందించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఏపీసీపీడీసీఎల్ పరిధిలోని 979 సబ్‌స్టేషన్లలో 156 సబ్‌స్టేషన్లు తుఫాన్ ప్రభావానికి గురయ్యాయి. వీటిలో 135 సబ్‌స్టేషన్లలో పునరుద్ధరణ పనులు పూర్తయ్యాయి. అలాగే 65, 33 కేవీ ఫీడర్లు ప్రభావితమవగా, 57 ఫీడర్లలో సరఫరాను పునరుద్ధరించారు.

పునరుద్ధరణ పనులను వేగవంతం చేసేందుకు 1,995 మంది సిబ్బందితో 399 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. తుఫాన్ కారణంగా విద్యుత్ వ్యవస్థకు ప్రాథమిక అంచనా ప్రకారం రూ.1.57 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు ఏపీసీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి తెలిపారు.

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలి :** తెగిపడిన విద్యుత్ వైర్లు, నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను ప్రజలు తాకరాదని సీఎండీ సూచించారు. విద్యుత్ ప్రమాదాలకు సంబంధించిన సమాచారం లేదా సరఫరా అంతరాయాలపై వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1912కు సమాచారం అందించాలని కోరారు.

**జిల్లా కంట్రోల్ రూమ్ నంబర్లు :** కృష్ణ: 6281709355, ఎన్టీఆర్: 9440817561 బాపట్ల: 9281413774, గుంటూరు: 9440817526, ప్రకాశం: 9440817491 పల్నాడు: 7661019447

## రైతులకు అండగా నిలవండి



(మొదటి పేజీ తరువాయి)

ఉన్నతాధికారుల వరకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. కోతకు సిద్ధంగా ఉన్న పంటలు, ఇప్పటికే కోసిన పంటలు, ధాన్యం నిల్వలు దెబ్బతినకుండా రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు అందించాలని ఆదేశించారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించిన వెంటనే అధికారులు గ్రామాల్లో పర్యటించి రైతులతో నేరుగా మాట్లాడాలని సూచించారు. నీటమునిగిన పంటలను కాపాడేందుకు పొలాల్లో నిలిచిన నీటిని తొలగించడం, పంటల పునరుద్ధరణకు అవసరమైన చర్యలు చేపట్టడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

పంట నష్టాన్ని గ్రామాలవారీగా, పంటలవారీగా, రైతులవారీగా అంచనా వేసి ప్రాథమిక నివేదికలను ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి పంపించాలని, అనంతరం సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. ప్రతి రైతు సమస్యపై సానుకూలంగా స్పందించి సత్వర పరిష్కారానికి కృషి చేయాలన్నారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నష్టపోయిన రైతుల వివరాలను త్వరితగతిన సేకరించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హులైన ప్రతి రైతుకూ సకాలంలో సహాయం అందేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. తుఫాను సమయంలో రైతులకు భరోసా కల్పించడమే అధికారుల ప్రథమ కర్తవ్యమని, క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యానికి తావులేకుండా సమష్టిగా పనిచేయాలని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్, వ్యవసాయ శాఖ కమిషనర్ మంజీర్ జిలానీ, ఉద్యానవన శాఖ కమిషనర్ శ్రీనివాసులుతో పాటు రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# పారా అథ్లెట్ నీరజ్ యాదవ్ ఆత్మహత్య



**న్యూఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్):** ఆసియా పారా క్రీడల స్వర్ణ పతక విజేత నీరజ్ యాదవ్(42) ఆత్మహత్య చేసుకున్నారు. ఢిల్లీలో అతని నివాసంలో మంగళవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకొంది. బుధవారం ఉదయం ఫ్లాట్‌లో అచేతనంగా ఉన్న నీరజ్ యాదవ్‌ను ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే ఆయన మరణించినట్లు డాక్టర్లు తెలిపారు. ఈ విషయాన్ని భారత పారా అథ్లెటిక్స్ జట్టు ప్రధాన కోచ్ ఎస్. సత్యనారాయణ ధృవీకరించారు. 'ఇలాంటి ఘటన జరగడం దురదృష్టం' అని సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. 2005, 2012, 2018 ఆసియా పారా క్రీడల్లో వీల్‌ఛైర్ టెన్నిస్‌లో నీరజ్ యాదవ్ స్వర్ణ పతకాలు సాధించారు. 2015లో న్యూఢిల్లీ వేదికగా జరిగిన అథ్లెటిక్స్ మీట్‌లో షాట్‌పుట్, జావెలిన్ త్రో, డిస్కస్ త్రో విభాగాల్లో స్వర్ణ పతకాలు సాధించారు. 2018లో జకార్తా వేదికగా జరిగిన ఆసియా పారా క్రీడల్లో జావెల్ త్రో ఎఫ్–55లో 29.84మీ. విసిరి రికార్డు నెలకొల్పారు. 2023 హాంగ్జౌ క్రీడల్లో జావెలిన్ త్రో, డిస్కస్ త్రో, షాట్ పుట్ విభాగాల్లో స్వర్ణ పతకాలు సాధించి హ్యాట్రిక్ సాధించారు. ఆ తర్వాత నేషనల్ డోపింగ్ ఏజెన్సీ(నాడా) నిర్వహించిన డిఎన్ఎ పరీక్షల్లో విఫలమయ్యాడు. దీంతో ఐచి-నగోయా వేదికగా జరిగిన 5వ ఆసియా పారా క్రీడలకు నీరజ్ యాదవ్ ఎంపికకాలేదు. నీరజ్ యాదవ్ ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిన వెంటనే పారా ఒలింపిక్ ఛాంపియన్లు సుమిత్ అంటిల్, విపిన్ కాసానా ఆసుపత్రికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

**ఆసియా పారా గేమ్స్‌లో నీరజ్ యాదవ్ కు 3 స్వర్ణాలు .. :** 2018లో ఇండోనేషియాలోని జకార్తా వేదికగా జరిగిన పురుషుల ఫీ55 జావెలెన్ త్రో విభాగంలో 29.84 మీటర్ల దూరంతో ఆసియా రికార్డు నమోదు చేసిన నీరజ్ యాదవ్ స్వర్ణ పతకం సాధించారు. 2023లో చైనాలోని హాంగ్‌జౌ వేదికగా జరిగిన ఆసియా పారా గేమ్స్‌లో జావెలెన్ త్రో ఫీ55, డిస్కస్ త్రో F54/55/56 విభాగాల్లో నీరజ్ యాదవ్ రెండు స్వర్ణ పతకాలను అందుకున్నారు. మొరాకో వేదికగా జరిగిన 2022 పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిక్స్‌లో పసిడి పతకం సాధించారు. దుబాయ్ వేదికగా జరిగిన 2016 ఫజ్జా గ్రాండ్ ప్రిక్స్‌లో ఫీ55 షాట్‌పుట్, డిస్కస్ త్రో విభాగాల్లో రెండు సిల్వర్ పతకాలు గెలుచుకున్నారు.

2015 ఢిల్లీ స్టేట్ అథ్లెటిక్స్ మీట్‌లో షాట్‌పుట్, జావెలెన్ త్రో, డిస్కస్ త్రో విభాగాల్లోనూ మూడు స్వర్ణ పతకాలు సాధించి యావత్ దేశాన్ని తనవైపు తిప్పుకున్నారు.

## విజయవాడ విమానాశ్రయంలో విమాన సర్వీసులు రద్దు

**గన్నవరం (జర్నలిస్ట్ ఫైల్) :** తుపాను కారణంగా ప్రతికూల వాతావరణం నెలకొనడంతో విజయవాడ (గన్నవరం) అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే విమాన సర్వీసులు బుధవారం పూర్తిగా నిలిచిపోయాయి. ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఇండిగో, ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఫ్లై91 సంస్థలు తమ సర్వీసులను రద్దు చేయడంతో కడప, హైదరాబాద్, విశాఖపట్నం, చెన్నై, బెంగళూరు, ఢిల్లీ నగరాలకు వెళ్లాల్సిన ప్రయాణికులపై తీవ్ర ప్రభావం పడింది.

రద్దయిన వాటిలో ఫ్లై91 సంస్థకు చెందిన హైదరాబాద్ కు వెళ్లే (IC 3301/3302), (IC 3305/3306) విమానాలతో పాటు, ఎయిర్ ఇండియాకు చెందిన ఢిల్లీ విమానం (AI 1724/1851) కూడా ఉన్నాయి. అంతకుముందు మంగళవారం సైతం ఇండిగో సంస్థకు చెందిన మధ్యాహ్నం కడప (6జు 7711/7712), సాయంత్రం హైదరాబాద్ (6E 2780/2581), రాత్రి చెన్నై (6E 7305/7302), బెంగళూరు (6E 7247/7246) సర్వీసులతో పాటు, విశాఖపట్నం వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ (IX 2413/2414) విమానాలు నిలిచిపోయాయి. ఆయా విమానాల్లో ప్రయాణించాల్సిన వారు ఈ మార్పులను గమనించి తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని విమానాశ్రయ అధికారులు సూచించారు.

# రెండు హైస్పీడ్ రైళ్లు ఢీ-64 మంది మృతి



**మాడ్రిడ్:** మధ్య స్పెయిన్‌లో రెండు హైస్పీడ్ రైళ్లు ఢీకొన్న ఘటనలో 64 మంది ప్రాణాలు కోల్పోయారు. టోలెడో ప్రావిన్స్‌లో బుధవారం ఉదయం ఈ ప్రమాదం జరిగిందని స్పెయిన్ రైల్వే వ్యవస్థ నిర్వాహక సంస్థ ఎడిఐఎఫ్ తెలిపింది. రెన్ఫే , ఇరియో అనే రెండు వేర్వేరు సంస్థలు నడుపుతున్న రైళ్లు స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 9 గంటల ప్రాంతంలో ఢీకొన్నాయి. ఈ ఘటనలో రెండు బోగీలు పట్టాలు తప్పాయని ప్రాంతీయ ప్రభుత్వ ప్రతినిధి చెప్పారు. స్థానిక మీడియా కథనం ప్రకారం, ఒకే దిశలో వెళ్తున్న రెండు రైళ్లలో ఒకటి మరో రైలు వెనుక భాగాన్ని ఢీకొట్టడంతో రెండు బోగీలు పట్టాలపై నుంచి పక్కకు పడిపోయాయి. ప్రమాదంలో చిక్కుకున్న ఓ ప్రయాణికుడి కుమార్తె మాట్లాడుతూ, ఆయన ట్రే టేబుల్ పెట్టుకుని పని చేసుకుంటుండగా ఒక్కసారిగా బలమైన కుదుపు అనిపించిందని తెలిపారు.

**మృతుల సంఖ్య పెరిగే అవకాశం.. :** తీవ్రంగా దెబ్బతిన్న రెండు బోగీల నుంచి ప్రాణాలతో ఉన్నవారిని, మృతదేహాలను వెలికితీయడంపై సహాయక సిబ్బంది దృష్టి సారించారని ఆరోగ్య మంత్రి మోనికా గార్సియా మీడియాకు తెలిపారు. క్షతగాత్రులను ప్రాంతంలోని వివిధ ఆసుపత్రులకు తరలించినట్లు చెప్పారు. "హైస్పీడ్‌లో జరిగిన ఢీకొనడం కాబట్టి ఇది పెను విషాదంగా మారే అవకాశం ఉంది" అని ఆమె వ్యాఖ్యానించారు. ప్రమాదం కారణంగా మాడ్రిడ్, సియుడాడ్ రియల్, అండలూసియా మధ్య రైలు సర్వీసులను నిలిపివేసినట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంది.

**రైళ్ల రాకపోకలకు అంతరాయం :** ఈ ప్రమాదంతో మాడ్రిద్ -అండలూసియా మధ్య రైళ్ల రాకపోకలను అధికారులు నిలిపివేశారు. ప్రయాణికులకు అవసరమైన సహాయం అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఐఆర్ఓ సంస్థ ప్రోటోకాల్ ప్రకారం అధికారులతో కలిసి పనిచేస్తున్నట్లు వెల్లడించింది. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ప్రమాదానికి గురైన రైళ్లలో ఒకటి ప్రభుత్వ రంగ సంస్థ రెన్ఫేకు చెందినది కాగా, మరొకటి ప్రైవేటు సంస్థ ఐఆర్ఓకు చెందినది. రెన్ఫే రైలులో 397 మంది, ఐఆర్వో రైలులో 147 మంది ప్రయాణికులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

**ప్రధాని దిగ్భ్రాంతి :** ప్రధాని పెడ్రో సాంచెజ్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ, ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రవాణా మంత్రి, కాస్టిల్లా–లా మంచా అధ్యక్షుడితో నిరంతరం సంప్రదింపుల్లో ఉన్నానని చెప్పారు. అత్యవసర సేవల సిబ్బంది సంబంధిత విభాగాల సమన్వయంతో బాధితులకు సహాయం అందిస్తున్నారని, బాధితులు, వారి కుటుంబాలకు సంఘీభావం తెలుపుతున్నానని పేర్కొన్నారు.

**ఈ ఏడాది రెండో భారీ రైలు ప్రమాదం :** స్పెయిన్‌లో ఈ ఏడాది జరిగిన రెండో పెద్ద రైలు ప్రమాదం ఇది. జనవరిలో దక్షిణ స్పెయిన్‌లో రైలు పట్టాలు తప్పి ఎదురుగా వస్తున్న మరో రైలును ఢీకొన్న ఘటనలో 45 మంది ప్రాణాలు కోల్పోయారు. 2013లో జరిగిన రైలు ప్రమాదంలో 80 మంది మృతి చెందగా, ఆ తర్వాత దేశంలో అత్యంత ప్రాణాంతకమైన రైలు ప్రమాదాల్లో జనవరి ఘటన ఒకటిగా నిలిచింది. తాజా ప్రమాదంతో స్పెయిన్ హైస్పీడ్ రైలు వ్యవస్థ భద్రతపై మరోసారి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# మానవాళికి ముప్పు.. భవిష్యత్తు మన చేతుల్లోనే

## అణుయుద్ధం నుంచి కృత్రిమ మేధ వరకు.. 2100 నాటికి ప్రపంచాన్ని వెంటాడే 17 ప్రమాదాలపై హెచ్చరిక




మానవ నాగరికత ఎన్నో విపత్తులను ఎదుర్కొని నిలబడింది. యుద్ధాలు జరిగాయి.. మహమ్మారులు వచ్చాయి.. కరువులు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించాయి. అయినా ప్రతిసారీ మానవ మేధస్సు, శాస్త్ర విజ్ఞానం, పరస్పర సహకారం కొత్త మార్గాలను చూపించాయి. అయితే ఇప్పుడు మానవాళి ఎదుర్కొంటున్న సవాళ్ల స్వభావం మారుతోంది. మనిషి సృష్టించిన సాంకేతికతే మనిషికి ముప్పుగా మారే పరిస్థితి ఒకవైపు కనిపిస్తుంటే.. మరోవైపు వాతావరణ మార్పులు, కాలుష్యం, అసమానతలు, పోషకాహార లోపం వంటి సమస్యలు నెమ్మదిగా భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయి.

ఇలాంటి నేపథ్యంలో లిది లాన్సెట్లి కమిషన్ తాజా విశ్లేషణ ప్రపంచ దేశాలను ఆలోచింపజేసే హెచ్చరికను చేసింది. 2025 నుంచి 2100 మధ్య మానవ ఆరోగ్యం, భద్రత, మనుగడపై తీవ్ర ప్రభావం చూపగల 17 ప్రధాన ప్రమాదాలను ఈ అధ్యయనం గుర్తించింది. 204 దేశాలు, ప్రాంతాలకు సంబంధించిన సమాచారం, చారిత్రక ఆధారాలు, భవిష్యత్ అంచనాలను పరిశీలించిన 35 మంది నిపుణులు ఈ విశ్లేషణకు రూపకల్పన చేశారు.

అయితే ఈ నివేదికను "2100 నాటికి మానవాళి అంతమవుతుంది" అనే భవిష్యవాణిగా చూడటం సరికాదు. అదే ఈ అధ్యయనంలోని అత్యంత ముఖ్యమైన అంశం. ప్రమాదాలు తప్పనిసరిగా సంభవిస్తాయని కమిషన్ చెప్పడం లేదు. వాటి తీవ్రత ఎంత ఉండొచ్చు? వాటిని నివారించేందుకు ఇప్పుడే ఎలాంటి చర్యలు తీసుకోవచ్చు? అన్నదే అసలు ఉద్దేశం. అంటే ఇది భయపెట్టే నివేదిక కంటే.. మేల్కొలిపే హెచ్చరిక.

**అణుయుద్ధం.. ఒక నిర్ణయంతో కోట్ల ప్రాణాలు**

ప్రపంచంలో అణ్వాయుధాల ఉనికి కొత్త విషయం కాదు. కానీ అణ్వాయుధ సామర్థ్యం పెరుగుతున్న కొద్దీ వాటి వినియోగం జరిగితే పరిణామాలు ఎంత దారుణంగా ఉంటాయన్న ఆందోళన కూడా పెరుగుతోంది. ఒక అణుయుద్ధం కేవలం యుద్ధం జరుగుతున్న ప్రాంతానికే పరిమితం కాదు. పేలుళ్లు, రేడియేషన్, ఆహార ఉత్పత్తి అంతరాయం, వాతావరణ ప్రభావాలు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై దెబ్బ వంటి అనేక పరిణామాలు దేశాల సరిహద్దులను దాటి వ్యాపించవచ్చు.

లాన్సెట్ కమిషన్ అంచనా ప్రకారం అణు ఘర్షణను నివారించగలిగితే 2100 నాటికి సుమారు 13.3 కోట్ల మరణాలను, 9.35 బిలియన్ ఆరోగ్యకర జీవన సంవత్సరాల నష్టాన్ని నివారించే అవకాశం ఉంది. అణుయుద్ధం సంభవించే అవకాశం తక్కువగా ఉన్నప్పటికీ, అది జరిగితే పరిణామాలు అత్యంత తీవ్రంగా ఉండే ప్రమాదాల్లో ఒకటిగా కమిషన్ దీనిని గుర్తించింది.

అందుకే అణ్వస్త్ర నియంత్రణ, దేశాల మధ్య సంభాషణ, దౌత్యపరమైన పరిష్కారాలు, అంతర్జాతీయ సహకారం మరింత బలపడాలి. ఆయుధ సంపత్తిని పెంచుకోవడమే భద్రతకు ఏకైక మార్గమన్న ఆలోచన నుంచి ప్రపంచం బయటకు రావాల్సిన అవసరం ఉంది.

**కృత్రిమ మేధ.. వరమా? శాపమా?**

ఇప్పటి ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల్లో కృత్రిమ మేధ ఒకటి. వైద్యం, విద్య, వ్యవసాయం, పరిశ్రమలు, రవాణా, పరిపాలన వంటి అనేక రంగాల్లో ఏఐ ఇప్పటికే విప్లవాత్మక మార్పులకు దారితీస్తోంది. అయితే అదే సాంకేతికత దుర్వినియోగానికి గురైతే ప్రమాదకర పరిణామాలు సంభవించే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ప్రత్యేకంగా హానికరమైన ఉద్దేశాలతో ఏఐను ఉపయోగించడం వల్ల జీవాయుధాల రూపకల్పన వంటి ప్రమాదాలు పెరగవచ్చన్న ఆందోళన ఉంది. అందుకే ఏఐ అభివృద్ధిని ఆపడం పరిష్కారం కాదు; దాని వినియోగానికి స్పష్టమైన నైతిక, చట్టపరమైన, భద్రతా ప్రమాణాలు ఏర్పాటు చేయడం అవసరం. ఏఐపై ప్రపంచవ్యాప్తంగా సమన్వయంతో కూడిన నియంత్రణ వ్యవస్థలు అభివృద్ధి చెందాలి.

లాన్సెట్ కమిషన్ ఏఐ దుర్వినియోగాన్ని కూడా "ఎక్స్‌టింక్షన్ పొటెన్షియల్" కలిగిన రెండు ప్రధాన ముప్పుల్లో ఒకటిగా పేర్కొంది. దాని ప్రమాదాన్ని తగ్గించగలిగితే 10.4 బిలియన్ ఆరోగ్యకర జీవన సంవత్సరాల నష్టాన్ని నివారించే అవకాశం ఉందని అంచనా వేసింది.

**యుద్ధం మాత్రమే కాదు.. ఆకలి కూడా ముప్పే**

మానవాళికి ముప్పు అంటే మనం సాధారణంగా యుద్ధాలు, అణ్వాయుధాలు, మహమ్మారులను మాత్రమే ఊహిస్తాం. కానీ లాన్సెట్ నివేదిక మరింత విస్తృతమైన దృక్కోణాన్ని ముందుకు తెచ్చింది. బాలల పోషకాహార లోపం, విద్యా లోపం, ఆదాయ అసమానతలు, ఊబకాయం, అధిక రక్తపోటు, మానసిక ఆరోగ్య సమస్యలు, ధూమపానం, అధిక మద్యపానం వంటి అంశాలు కూడా భవిష్యత్ ఆరోగ్యంపై భారీ ప్రభావం చూపుతాయని తెలిపింది.

ఇది మనకు ఒక ముఖ్యమైన సందేశాన్ని ఇస్తోంది. మానవాళి మనుగడను కాపాడటానికి కేవలం సైనిక భద్రత సరిపోదు. ఆరోగ్య భద్రత, ఆహార భద్రత, ఆర్థిక భద్రత, విద్యా భద్రత, పర్యావరణ భద్రత కూడా అంతే అవసరం.

**అసమానత.. కనిపించని కానీ ప్రమాదకరమైన శత్రువు :**

సమాజంలో పెరుగుతున్న ఆదాయ అసమానతలు కూడా భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపగలవని నివేదిక హెచ్చరిస్తోంది. పేదరికం కేవలం ఆదాయం లేకపోవడమే కాదు. అది ఆరోగ్యం, విద్య, పోషకాహారం, ఉపాధి, జీవన ప్రమాణాలను ప్రభావితం చేసే గొలుసు సమస్య.

ఆదాయ అసమానతల వల్ల 2100 నాటికి 13.8 బిలియన్ ఆరోగ్యకర జీవన సంవత్సరాల నష్టం సంభవించే అవకాశం ఉందని అంచనా. అలాగే విద్యా స్థాయి మెరుగుపడటం ద్వారా 16.1 బిలియన్ ఆరోగ్యకర జీవన సంవత్సరాల నష్టాన్ని నివారించే అవకాశం ఉందని కమిషన్ పేర్కొంది.

అంటే పేదరిక నిర్మూలన, నాణ్యమైన విద్య, మహిళల సాధికారత, సమాన అవకాశాలు వంటి అంశాలను కేవలం సంక్షేమ కార్యక్రమాలుగా చూడకూడదు. అవి భవిష్యత్ మానవ భద్రతకు పెట్టుబడులుగా చూడాలి.

**వాతావరణ మార్పు.. నేటి సమస్య, రేపటి సంక్షోభం :** వాతావరణ మార్పు ఇప్పటికే ప్రపంచ ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తోంది. తీవ్రమైన వేడి, కరువులు, వరదలు, తాగునీటి కొరత, ఆహార ఉత్పత్తిపై ప్రభావం, అంటువ్యాధుల వ్యాప్తి వంటి అనేక సమస్యలు పరస్పరం అనుసంధానమై ఉన్నాయి.

ఇటీవల వెలువడిన లాన్సెట్ కౌంట్‌డౌన్ నివేదిక కూడా వాతావరణ మార్పుల ఆరోగ్య ప్రభావాలు వేగంగా పెరుగుతున్నాయని హెచ్చరించింది. 2023లో వేడి కారణంగా ప్రపంచవ్యాప్తంగా సుమారు 7.1 లక్షల మరణాలు సంభవించినట్లు అంచనా వేసింది. వాతావరణ మార్పుతో ముడిపడిన వేడి మరణాల వాటా కూడా పెరుగుతోందని తెలిపింది.

అందువల్ల పర్యావరణ పరిరక్షణను భవిష్యత్ తరాల కోసం మాత్రమే చేయాల్సిన బాధ్యతగా చూడకూడదు. అది నేటి ప్రజారోగ్యాన్ని కాపాడే అత్యవసర చర్య.

**ధూమపానం నుంచి ఊబకాయం వరకు.. :** ప్రపంచాన్ని నెమ్మదిగా ప్రభావితం చేస్తున్న జీవనశైలి సమస్యలను కూడా విస్మరించలేం. ధూమపానం, అధిక మద్యపానం, ఊబకాయం, అధిక రక్తపోటు వంటి సమస్యలు వ్యక్తిగత ఆరోగ్యానికే పరిమితం కావు. అవి కుటుంబాల ఆర్థిక స్థితిని, దేశాల ఆరోగ్య వ్యవస్థలపై భారాన్ని, ఉత్పాదకతను ప్రభావితం చేస్తాయి.

ఊబకాయం కారణంగా 2100 నాటికి 23.1 బిలియన్ ఆరోగ్యకర జీవన సంవత్సరాల వరకు నష్టం సంభవించే అవకాశం ఉందని కమిషన్ అంచనా వేసింది. ఇది వ్యక్తిగత ఆరోగ్యంపై అవగాహనతో పాటు ప్రభుత్వ విధానాల్లోనూ మార్పు అవసరాన్ని సూచిస్తోంది.

**మహమ్మారుల నుంచి జీవాయుధాల వరకు :** కోవిడ్-19 ప్రపంచానికి ఒక పాఠం నేర్పింది. ఒక అంటువ్యాధి కొన్ని వారాల్లోనే దేశాల సరిహద్దులను దాటి ప్రపంచ సంక్షోభంగా మారగలదని అది నిరూపించింది. భవిష్యత్తులో సహజంగా ఉద్భవించే మహమ్మారులతో పాటు, జీవసాంకేతిక పరిజ్ఞానం దుర్వినియోగం వల్ల కలిగే ప్రమాదాలను కూడా ఎదుర్కోవాల్సి ఉంటుంది.

అందుకే ప్రపంచ దేశాలు ముందస్తు నిఘా వ్యవస్థలు, వేగవంతమైన వ్యాధి గుర్తింపు, వ్యాక్సిన్ల పరిశోధన, ఔషధాల లభ్యత, బలమైన ప్రజారోగ్య వ్యవస్థలపై పెట్టుబడులు పెంచాలి. సంక్షోభం వచ్చిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే సిద్ధంగా ఉండటం అత్యంత కీలకం.

**పరిష్కారం ఒక్కటే.. సమిష్టి బాధ్యత :** లాన్సెట్ కమిషన్ సూచించిన మార్గం స్పష్టంగా ఉంది. మొదటిగా భవిష్యత్ ముప్పులను ఎదుర్కొనే సామర్థ్యం ఉన్న ఆరోగ్య వ్యవస్థలను నిర్మించాలి. రెండోది అవసరమైన చోట కొత్త శాస్త్రీయ ఆవిష్కరణలకు భారీగా పెట్టుబడులు పెట్టాలి. మూడోది మారుతున్న ముప్పులను నిరంతరం పర్యవేక్షించే వ్యవస్థలను బలోపేతం చేయాలి.

ఈ మూడు చర్యలు కేవలం ప్రపంచంలోని సంపన్న దేశాలకు మాత్రమే సంబంధించినవి కావు. భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు కూడా అవి అత్యంత అవసరం. ఆరోగ్యం, విద్య, పర్యావరణం, సాంకేతికత, రక్షణ, ఆర్థిక వ్యవస్థలను విడివిడిగా కాకుండా పరస్పరం అనుసంధానించి విధానాలను రూపొందించాల్సిన సమయం వచ్చింది.

**భవిష్యత్తు రాసిపెట్టలేదు :** లాన్సెట్ నివేదికలోని అసలు సందేశం భయంకరం కాదు.. బాధ్యతను గుర్తుచేసేది. మానవాళి ఎదుర్కొంటున్న 17 ముప్పులు పరస్పరం అనుసంధానమై ఉన్నాయి. ఒక సమస్య మరో సమస్యను తీవ్రతరం చేయవచ్చు. అదే సమయంలో ఒక రంగంలో తీసుకునే సరైన నిర్ణయం అనేక ప్రమాదాలను తగ్గించగలదు.

అణుయుద్ధాన్ని నివారించడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చు. ఏఐను బాధ్యతాయుతంగా వినియోగించడం ద్వారా కొత్త ప్రమాదాలను అడ్డుకోవచ్చు. కాలుష్యాన్ని తగ్గించడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరచవచ్చు. విద్యను విస్తరించడం ద్వారా తరతరాల జీవన ప్రమాణాలను పెంచవచ్చు. పేదరికాన్ని తగ్గించడం ద్వారా అసమానతలను తగ్గించవచ్చు. వాతావరణ పరిరక్షణ ద్వారా భవిష్యత్ తరాలను కాపాడవచ్చు.

కాబట్టి 2100 నాటికి మానవాళి అంతమవుతుందా? అనే ప్రశ్న కంటే.. లిలి2100లో మానవాళి ఎలా ఉండాలి?లిలి అనే ప్రశ్నే మన ముందుండాలి.

భవిష్యత్తు మన చేతుల్లోనే ఉంది. శాస్త్రాన్ని విధ్వంసానికి కాకుండా అభివృద్ధికి ఉపయోగిస్తామా? సాంకేతికతను నియంత్రిస్తామా? ప్రకృతిని కాపాడుతామా? సమాజంలో అసమానతలను తగ్గిస్తామా? ప్రపంచ దేశాలు కలిసి పనిచేస్తాయా? అనే ప్రశ్నలకు ఈ తరమే సమాధానం ఇవ్వాలి.

2100 అనేది చాలా దూరంగా కనిపించే సంవత్సరం. కానీ ఆ సంవత్సరపు ప్రపంచానికి పునాది మాత్రం ఈరోజే పడుతోంది. మానవాళి భవిష్యత్తు ముందే నిర్ణయించబడలేదు. మన నిర్ణయాలే దాన్ని నిర్ణయిస్తాయి.

# రాజకీయ పోరు.. బంధాలు బలిపీఠంపై?




ఒకే ఇంట్లో పుట్టారు.. ఒకే కుటుంబంలో పెరిగారు.. కష్టసుఖాల్లో ఒకరికొకరు అండగా నిలిచారు. కానీ ఎన్నికల నగారా మోగగానే అదే ఇంట్లో రాజకీయ విభేదాలు మొదలయ్యాయి. నిన్నటి వరకు అన్నాచెల్లెళ్లు.. అక్కాతమ్ముళ్లు.. తల్లీకూతుళ్లు.. తోడికోడళ్లు. నేడు మాత్రం ఒకరి ఓటమి కోసం మరొకరు ప్రచారం చేయాల్సిన పరిస్థితి. లిలిరాజకీయమే బంధుత్వం కంటే పెద్దదైందా? లేక ప్రజాస్వామ్యం కుటుంబ గోడలను దాటి వ్యక్తిగత స్వేచ్ఛకు కొత్త అర్థం చెబుతోందా?

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా కనిపిస్తున్న కొన్ని ఆసక్తికరమైన పరిణామాలు ఈ ప్రశ్నలను ముందుకు తెస్తున్నాయి. ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులు వేర్వేరు రాజకీయ పార్టీల తరపున ప్రత్యర్థులుగా బరిలోకి దిగుతున్నారు. ఒకరి ఇంటి గడపే మరొకరి ఎన్నికల ప్రచారానికి కేంద్రంగా మారుతోంది. ఒకే కుటుంబం రెండు రాజకీయ శిబిరాలుగా విడిపోతోంది. ఇది కేవలం ఎన్నికల విచిత్రం కాదు. మారుతున్న రాజకీయ సంస్కృతికి ఒక సంకేతం.

ప్రజాస్వామ్యంలో ప్రతి వ్యక్తికీ తనకు నచ్చిన రాజకీయ పార్టీని ఎంచుకునే హక్కు ఉంది. కుటుంబ సభ్యులందరూ ఒకే పార్టీని సమర్థించాలనే నిబంధన లేదు. ఆలోచనలు వేరు కావచ్చు.. సిద్ధాంతాలు వేరు కావచ్చు.. రాజకీయ లక్ష్యాలు వేరు కావచ్చు. అందులో తప్పేమీ లేదు. నిజానికి ఒకే కుటుంబంలో భిన్న రాజకీయ అభిప్రాయాలకు చోటు ఉండటం ప్రజాస్వామ్య పరిణతికి నిదర్శనంగానే చూడాలి.

కానీ సమస్య అక్కడితో ఆగిపోదు. లిలిరాజకీయ భేదం వ్యక్తిగత శత్రుత్వంగా మారినప్పుడు అసలు ప్రమాదం మొదలవుతుంది.లిలి ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా అదే కుటుంబంలో జీవించాలి. అదే గ్రామంలో ఉండాలి. అదే సమాజంతో కలిసి నడవాలి. గెలిచినవారు, ఓడినవారు చివరకు ప్రజల మధ్యకే వెళ్లాలి. మరి తాత్కాలిక ఎన్నికల విజయం కోసం శాశ్వతమైన బంధాలను ఎందుకు పణంగా పెట్టాలి?

స్థానిక ఎన్నికల అసలు ఉద్దేశం కూడా ఇదే సందర్భంలో గుర్తు చేసుకోవాలి. గ్రామం, పట్టణం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపగల నాయకత్వాన్ని ఎన్నుకోవడమే ప్రజాస్వామ్య లక్ష్యం. రహదారులు కావాలి.. తాగునీరు కావాలి.. పారిశుద్ధ్యం మెరుగుపడాలి.. డ్రైనేజీ వ్యవస్థ బాగుపడాలి.. ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందాలి. స్థానిక సంస్థలు అభివృద్ధికి కేంద్రాలుగా మారాలి. కానీ అభివృద్ధి అజెండా వెనక్కి వెళ్లి.. కుటుంబ ప్రతిష్ఠ, వ్యక్తిగత ఆధిపత్యం, పార్టీ పోరు ముందుకు వస్తే ప్రజలకు మిగిలేది ఏమిటి?

అందుకే ఎన్నికల్లో కుటుంబ సభ్యులు ప్రత్యర్థులుగా నిలబడటం తప్పు కాదు. లిలిప్రత్యర్థులుగా నిలబడి శత్రువులుగా మారడమే తప్పు.లిలి రాజకీయ పోటీ ఉండాలి.. కానీ వ్యక్తిగత కక్షలు ఉండకూడదు. సిద్ధాంతపరమైన విమర్శలు ఉండాలి.. కానీ వ్యక్తిగత దూషణలు ఉండకూడదు. గెలవాలనే పట్టుదల ఉండాలి.. కానీ బంధాలను తెంచుకునే స్థాయిలో కాదు.

రాజకీయాలు శాశ్వతం కావు. పదవులు శాశ్వతం కావు. ఎన్నికల ఫలితాలు కూడా శాశ్వతం కావు. కానీ కుటుంబ బంధాలు, మానవ సంబంధాలు, సామాజిక అనుబంధాలు మాత్రం తరతరాలకు కొనసాగుతాయి. అందుకే ఈ స్థానిక ఎన్నికలు ఒక ముఖ్యమైన సందేశాన్ని ఇవ్వాలి-పార్టీలు వేరైనా పరవాలేదు.. అభిప్రాయాలు వేరైనా పరవాలేదు.. కానీ మనుషులు విడిపోకూడదు.లిలి ప్రజాస్వామ్యం మన మధ్య గీతలు గీయడానికి కాదు.. భిన్నాభిప్రాయాలతోనూ కలిసి జీవించడం నేర్పడానికి. ఆ స్ఫూర్తిని కాపాడగలిగితేనే ఎన్నికలు నిజమైన ప్రజాస్వామ్య పండుగలవుతాయి.

# నా కథను నేనే చెబుతా.. జ్ఞాపకాల వెనుక రాజకీయ చరిత్ర

ఒక వ్యక్తి గురించి ప్రపంచం ఎన్నో కథలు చెప్పవచ్చు. ఆ వ్యక్తిని అభిమానించే వారు ఒకలా.. వ్యతిరేకించే వారు మరోలా.. రాజకీయ ప్రత్యర్థులు ఇంకోలా చిత్రీకరించవచ్చు. కాలక్రమంలో ఒకరి జీవితానికి సంబంధించి వాస్తవాలు, అభిప్రాయాలు, విమర్శలు, ఆరోపణలు అన్నీ కలిసిపోయే అవకాశం ఉంది. అలాంటి సమయంలో ఆ వ్యక్తి స్వయంగా కలం పట్టి.. లిలి"ఇప్పటివరకు ఇతరులు నా కథ చెప్పారు.. ఇక నా కథను నేనే చెబుతాను"లిలి అంటే దానికి సాధారణ ఆత్మకథ కంటే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది.

కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ రాస్తున్న లిదివత్రీశీఅస్త్రఅస్త్ర: ూ జీశీబతీఅవఎ శీట ాశీజవలి పుస్తకం ఇప్పుడు అలాంటి ఆసక్తినే రేకెత్తిస్తోంది. నవంబర్ 10న ఈ పుస్తకం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. భారత్‌లో హార్పర్‌కాలిన్స్ ప్రచురిస్తోంది. 544 పేజీల ఈ జ్ఞాపకాల పుస్తకం ఆమె బాల్యం, రాజీవ్ గాంధీతో పరిచయం, వివాహం, ఇందిరాగాంధీ హత్య, రాజీవ్ గాంధీ హత్య, అనంతరం రాజకీయాల్లోకి ఆమె ప్రవేశం వంటి కీలక ఘట్టాలను స్పృశించనుంది.

అయితే ఈ పుస్తకంపై ఆసక్తి కేవలం గాంధీ కుటుంబంపై ఉన్న రాజకీయ ఆసక్తి వల్లే కాదు. లిలిఒక ప్రజా వ్యక్తి తనను తాను ఎలా చూసుకుంటారు? చరిత్రలో తన పాత్రను ఎలా వివరిస్తారు? ఇతరులు రాసిన కథనాలతో తన అనుభవాలకు ఉన్న తేడా ఏమిటి?లిలి అన్న ప్రశ్నలకు సమాధానం తెలుసుకోవాలన్న ఆసక్తి కూడా దీనికి కారణం.

**'నా కథ' చెప్పుకోవాలన్న అవసరం :** సోనియా గాంధీ తాజాగా విడుదల చేసిన వీడియోలో తన గురించి ఎన్నో విషయాలు రాయబడ్డాయని, వాటిలో కొన్ని సరైనవి కావని, మరికొన్ని అతిశయోక్తితోనో లేదా కల్పితంగానో ఉన్నాయని పేర్కొన్నారు. అందుకే జరిగిన విషయాలను తన అనుభవాల ప్రకారం నమోదు చేయాలనిపించిందని చెప్పారు. పుస్తకం వెలువడిన తర్వాత కొందరి అభిప్రాయాలు మారవచ్చని, మరికొందరి అభిప్రాయాలు మరింత ప్రతికూలంగా మారవచ్చని కూడా ఆమె అంగీకరించారు.

ఇక్కడే ఆత్మకథకు ఉన్న అసలు విలువ కనిపిస్తుంది. ఆత్మకథ అంటే కేవలం తనను తాను సమర్థించుకోవడం కాదు. అది ఒక వ్యక్తి చూసిన కాలానికి సంబంధించిన ప్రత్యక్ష సాక్ష్యం కూడా. అయితే ఆత్మకథలో రచయిత దృష్టికోణం సహజంగానే ఉంటుంది. అందువల్ల దానిని చరిత్రకు తుది తీర్పుగా కాకుండా.. లిలిచరిత్రలోని ఒక ముఖ్యమైన ప్రత్యక్ష అనుభవంగాలిలి చదవడం అవసరం.

- **సోనియా గాంధీ 'బెలాంగింగ్'..**
- **ఒక వ్యక్తి ఆత్మకథ మాత్రమే కాదు, ఆరు దశాబ్దాల భారత రాజకీయ పరిణామాలకు అద్దం**




**ప్రేమ నుంచి రాజకీయాల వరకు :** Belonging అనే శీర్షికే పుస్తకంలోని భావోద్వేగ ప్రపంచాన్ని సూచిస్తోంది. యుద్ధానంతర ఇటలీలోని చిన్న పట్టణం నుంచి కేంబ్రిడ్జ్ వరకు.. అక్కడ రాజీవ్ గాంధీతో పరిచయం నుంచి భారతదేశంలోకి అడుగుపెట్టడం వరకు ఆమె ప్రయాణం సాగింది. 1965లో కేంబ్రిడ్జ్‌లోని ఒక చిన్న గ్రీకు రెస్టారెంట్‌లో రాజీవ్‌ను కలిసిన సందర్భాన్ని ఆమె ఇటీవల గుర్తుచేసుకున్నారు. ఆ పరిచయం క్రమంగా ప్రేమగా మారి 1968లో వివాహానికి దారితీసింది.

ఇది ఒక సాధారణ ప్రేమకథలా ప్రారంభమైనా.. తర్వాత అది భారత రాజకీయ చరిత్రలో ఒక కీలక కుటుంబంతో ముడిపడిన జీవితంగా మారింది. ఇందిరాగాంధీ కోడలిగా, రాజీవ్ గాంధీ భార్యగా, ఆపై కాంగ్రెస్ అధ్యక్షురాలిగా, దేశ రాజకీయాల్లో అత్యంత ప్రభావవంతమైన నాయకురాలిగా ఆమె ప్రయాణం సాగింది.

ఈ ప్రయాణంలో వ్యక్తిగత ఆనందాలకంటే విషాదాలే ఎక్కువ ముద్ర వేశాయి. 1984లో ఇందిరాగాంధీ హత్య, 1991లో రాజీవ్ గాంధీ హత్య.. ఈ రెండు ఘటనలు ఆమె జీవితాన్ని పూర్తిగా మార్చేశాయి. ఆమె మాటల్లోనే చెప్పాలంటే, ప్రేమ, కుటుంబం, నష్టం, బాధ్యత.. చివరకు రాజకీయ జీవితం వైపు నడిపించిన అనుభవాలన్నీ ఒకదానితో ఒకటి ముడిపడ్డాయి.

**అధికారాన్ని అందుకుని.. దూరంగా నిలిచిన సందర్భం :** సోనియా గాంధీ రాజకీయ జీవితంలో అత్యంత చర్చనీయాంశమైన అంశాల్లో ఒకటి ప్రధానమంత్రి పదవిని స్వీకరించకపోవడం. 2004లో కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పుడు ఆమెకు ప్రధానమంత్రి పదవి దక్కే పరిస్థితి ఉన్నప్పటికీ, ఆ పదవిని స్వీకరించకుండా మన్మోహన్ సింగ్‌ను ముందుకు తీసుకువచ్చారు.

ఇది ఆమె రాజకీయ నిర్ణయాల్లో అత్యంత ఎక్కువగా చర్చించబడిన అంశాల్లో ఒకటి. అయితే ఇప్పుడు వెలువడబోయే జ్ఞాపకాల పుస్తకంలో ఆమె వ్యక్తిగత భావాలు, అప్పటి పరిస్థితులపై తన దృష్టికోణం ఎంతవరకు బయటపడుతుందన్నది ఆసక్తికరం.

అలాగే రాజీవ్ గాంధీ ప్రధానమంత్రి కావడాన్ని తాను మొదట్లో వ్యతిరేకించానని కూడా ఆమె తాజాగా వెల్లడించారు. ఇందిరాగాంధీ హత్య అనంతరం రాజీవ్‌ను ప్రధానమంత్రి పదవిని స్వీకరించమని కోరిన సమయంలో తాను పూర్తిగా వ్యతిరేకంగా ఉన్నానని ఆమె చెప్పారు. ఇలాంటి వివరాలే ఆత్మకథను రాజకీయ పత్రంగా మార్చగలవు.

**ప్రచురణ వివాదం.. మరింత ఆసక్తి:** ఈ పుస్తకానికి ప్రచురణకు ముందే వివాదం చుట్టుకుంది. తొలుత పెంగ్విన్ రాండమ్ హౌస్ ఇండియా ప్రచురణకు ముందుకు వచ్చినప్పటికీ, సంపాదకీయ మార్పులు, కొన్ని భాగాల తొలగింపుపై విభేదాలు తలెత్తినట్లు వార్తలు వచ్చాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆర్‌ఎస్‌ఎస్, మతపరమైన విభజనలు, మైనారిటీల పరిస్థితి వంటి సమకాలీన అంశాల ప్రస్తావనల విషయంలో అభిప్రాయభేదాలు వచ్చినట్లు లిది ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లి నివేదించింది. అనంతరం హార్పర్‌కాలిన్స్ ఇండియా ఈ పుస్తకాన్ని ప్రచురించేందుకు ముందుకొచ్చింది.

ఈ పరిణామం ఒక ముఖ్యమైన ప్రశ్నను ముందుకు తెస్తోంది. ఒక రచయిత తన అనుభవాలను రాసేటప్పుడు సంపాదకుడి పాత్ర ఎంతవరకు ఉండాలి? రాజకీయంగా సున్నితమైన అంశాలను తొలగించడం సంపాదకీయ బాధ్యతా? లేక రచయిత స్వేచ్ఛకు పరిమితి విధించడమా?

ఇది సోనియా గాంధీ పుస్తకానికి మాత్రమే సంబంధించిన ప్రశ్న కాదు. ప్రజాస్వామ్య సమాజంలో చరిత్రను నమోదు చేసే విధానానికి సంబంధించిన ప్రశ్న.

**పుస్తకం తీర్పు కాదు.. ఒక వాదన :** సోనియా గాంధీ తన జీవితాన్ని తానే వివరించబోతున్నారు. కానీ పాఠకులు ఆమె చెప్పిన ప్రతి అంశాన్ని యథాతథంగా అంగీకరించాల్సిన అవసరం లేదు. అలాగే ముందుగానే తిరస్కరించాల్సిన అవసరమూ లేదు.

చరిత్రకు అనేక కోణాలు ఉంటాయి. ఒక సంఘటనను ప్రత్యక్షంగా అనుభవించిన వ్యక్తి చెప్పేది ఒక కోణం. అదే సంఘటనను రాజకీయ ప్రత్యర్థి మరో కోణంలో చూడవచ్చు. పరిశోధకుడు ఆధారాలతో మరో విశ్లేషణ ఇవ్వవచ్చు. పాఠకుడి నిర్ణయం వీటన్నింటినీ పరిశీలించిన తర్వాతే రావాలి.

అందుకే Belonging పుస్తకాన్ని ఆత్మపక్ష సమర్థనగా కాకుండా.. ఒక చారిత్రక సాక్ష్యంగా చదవాలి. అందులోని వాస్తవాలను ఇతర ఆధారాలతో పోల్చుకోవాలి. భావోద్వేగాలను అర్థం చేసుకోవాలి. రాజకీయ వ్యాఖ్యానాలను విశ్లేషించాలి.

**వ్యక్తిగత జ్ఞాపకాల నుంచి ప్రజా చరిత్ర వరకు :** సోనియా గాంధీ పుస్తకం విడుదలయ్యే సమయానికి రాజకీయంగా చర్చలు జరగడం సహజం. ఆమె వ్యాఖ్యలు వివాదాలకు దారితీయవచ్చు. రాజకీయ పార్టీలు తమకు అనుకూలంగా ఉన్న అంశాలను ప్రస్తావించవచ్చు. విమర్శకులు ప్రశ్నలు లేవనెత్తవచ్చు. ఆమె అభిమానులు మరో కోణాన్ని ముందుకు తెచ్చే అవకాశం ఉంది.

ఆమె స్వయంగా కూడా పుస్తకం విడుదల తర్వాత "తమాషా" తప్పదని వ్యాఖ్యానించారు. ప్రజా జీవితంలో ఉన్నవారి విషయంలో అభిప్రాయ భేదాలు సహజమేనని ఆమె అంగీకరించారు.

కానీ చివరికి ఈ పుస్తకం ఒక వ్యక్తి గురించి మాత్రమే కాదు. భారత రాజకీయాలు కుటుంబాలను ఎలా మార్చాయి? అధికారం వ్యక్తిగత జీవితాలను ఎలా ప్రభావితం చేసింది? విషాదాలు ఒక వ్యక్తిని ప్రజా జీవితంలోకి ఎలా నెట్టాయి? రాజకీయ జ్ఞాపకాలను ఎవరు రాస్తారు? అనే ప్రశ్నలకు ఇది ఒక కొత్త కిటికీ తెరవవచ్చు.

భారత ప్రజాస్వామ్యంలో నాయకుల ప్రసంగాలు, ఎన్నికల ఫలితాలు, ప్రభుత్వ నిర్ణయాలు ఎంత ముఖ్యమో.. వారి వ్యక్తిగత అనుభవాలు, అంతర్గత సంఘర్షణలు, తీసుకున్న నిర్ణయాల వెనుక ఉన్న ఆలోచనలు కూడా అంతే ముఖ్యమైనవి.

లిలిఒక నాయకుడి కథను ఇతరులు రాయడం చరిత్రలో సాధారణం. కానీ ఒక నాయకురాలు తన కథను తానే రాయడం.. ఆ కథను సమాజం విమర్శనాత్మకంగా చదవడం.. అదే ప్రజాస్వామ్యానికి అందం.లిలి సోనియా గాంధీ లిదివత్రీశీఅస్త్రఅస్త్రలి పుస్తకం నిజంగా ఏం చెబుతుందో నవంబర్ 10 తర్వాతే పూర్తిగా తెలుస్తుంది. కానీ ఒక విషయం మాత్రం ఇప్పటికే స్పష్టమైంది-చరిత్రను రాయడం మాత్రమే కాదు.. చరిత్రను ఎవరు, ఏ దృష్టితో రాస్తున్నారన్నదీ అంతే ముఖ్యం.

# మక్తమాదారంలో నూతన పంచాయతీ భవనం ప్రారంభం

- రూ.20 లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మాణం
- గ్రామ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన నాయకులు





**కడ్తాల్ అక్టోబరు 28 (జర్నలిస్ట్ ఫైల్) :** రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం మక్తమాదారం గ్రామంలో కేంద్ర ప్రభుత్వ ఉపాధి హామీ పథకం (MGNREGS) నిధులు రూ.20 లక్షలతో నిర్మించిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని సోమవారం సర్పంచ్ లక్ష్మీదేవి నరసింహ,మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత నరసింహాలతో కలిసి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో మౌలిక వసతుల కల్పనలు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు.

**గ్రామ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి**

ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ నాయకులు గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.గ్రామంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని,సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని నాయకులు కోరారు.గ్రామస్తులు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యను పరిష్కరించడంతో పాటు తరచూ ఏర్పడుతున్న విద్యుత్ కోతలను నివారించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.అదేవిధంగా గ్రామంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం లేదా సంబంధిత అవసరాలను పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.గ్రామంలో మౌలిక వసతులను మెరుగుపరిచి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని నాయకులు కోరారు.

**అభివృద్ధి పనులపై ఆశలు**

నూతన గ్రామ పంచాయతీ భవనం అందుబాటులోకి రావడంతో గ్రామ పంచాయతీ పరిపాలనా కార్యకలాపాలకు మరింత సౌలభ్యం కలగనుంది.గ్రామంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను సంబంధిత శాఖల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు,గ్రామ నాయకులు గ్రామాభివృద్ధికి అవసరమైన పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి,సెక్రటరీ వెంకట్ రెడ్డి,ఉప సర్పంచ్ ఎర్ర శ్రీనివాస్,వార్డు సభ్యులు సింగ్యారి యాదగిరి, యాదయ్య, సరిత,శ్రీకాంత్,మైసమ్మ,మహేశ్వరి మరియు టీపీసీసీ సభ్యులు ఆయిళ్ళ శ్రీనివాస్ గౌడ్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాటనరసింహ,మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు ఆర్కోటం బాలరాజు,నాయకులు బోల్గం నరేష్ గౌడ్, సాయిలు, కృష్ణయ్య,షాబుద్దీన్,జమీల్ తో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కడ్తాల్‌లో వివాదాస్పద వెంచర్.. దళితుడి ప్లాట్ మాయం!

- తమ ప్లాటును వెంచర్ లే అవుట్‌లో చూపించారని బాధితుడి ఆరోపణలు
- వెంచర్ ఏర్పాటుకు ముందే కొనుగోలు చేసిన ప్లాట్ ఎలా మాయమైంది?





**కడ్తాల్, అక్టోబరు 28 (జర్నలిస్ట్ ఫైల్) :** రంగారెడ్డి జిల్లా కడ్తాల్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 4,66లో ఉన్న వివాదాస్పద వెంచర్‌లో దళితుడికి చెందిన ప్లాట్ మాయమైనట్లు ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి.వెంచర్ ఏర్పాటు చేయకముందే కొనుగోలు చేసిన ప్లాట్‌ను గ్రామ పంచాయతీకి కేటాయించిన 10 శాతం స్థలంలో చూపించి, అమాయక దళితులను మోసం చేశారని బాధితుడు ఆరోపి స్తున్నారు.సదరు వెంచర్లో గతంలో కూడా ఎన్నో అవకతవకలు జరిగాయని,అలాగే తవ్వినకొద్ది ఇంకా వారి మోసాలు బయటకు వస్తుండడంతోఈ వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. బాధితుడి కథనం ప్రకారం..కాలె వెంకటయ్య 2000 సంవత్సరంలో 230 గజాల స్థలాన్ని కొనుగోలు చేశారు అనంతరం 2010లో ఆర్థిక అవసరాల నిమిత్తం అందులో 115 గజాలను మంగళ పల్లి నర్సింహకు విక్రయించి, మిగిలిన 115 గజాల ప్లాట్‌ను తన ఆధీనంలోఉంచుకున్నారు. సదరు భూమి యజమాని వారసులు మాకు అమ్మిన స్థలాన్ని తీసివేయకుండా అక్కడ లే అవుట్ చేయడం జరిగింది. అయితే,ప్రస్తుతం ఆ ప్లాట్ గ్రామ పంచాయతీకి కేటాయించిన 10 శాతం స్థలంలో ఉన్నట్లు చూపించడంతో తనకు అన్యాయం జరిగిందని ఆయన వాపోతున్నారు.

**అధికారుల విచారణతోనే వెలుగులోకి నిజాలు!**

వెంచర్ ఏర్పాటు చేయకముందే కొనుగోలు చేసిన ప్లాట్ గ్రామ పంచాయతీ 10 శాతం స్థలంలోకి ఎలా వెళ్లింది? సంబంధిత రికార్డుల్లో మార్పులు జరిగాయా? ప్లాట్ హక్కులకు సంబంధించిన పత్రాలను అధికారులు పరిశీలించారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి,వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని బాధితుడు కోరుతున్నారు.ఈ విషయమై కడ్తాల్ గ్రామ పంచాయతీ పాలక వర్గానికి,పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు వెల్లడించారు.సంబంధిత అధికారులు భూమి రికార్డులు,వెంచర్ అనుమతులు,గ్రామ పంచాయతీకి కేటాయిం చిన 10 శాతం స్థలానికి సంబంధించిన వివరాలను పరిశీలించి, నిజానిజాలు నిగ్గుతేల్చాలని స్థానికులు కోరుతున్నారు.బాధితుడికి న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకుంటారా? వివాదాస్పద ప్లాట్ వ్యవహారంలో వాస్తవాలు ఎప్పుడు వెలుగులోకి వస్తాయి? అన్నది వేచి చూడాలి.ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాయికంటి బిక్షపతి,సెక్రటరీ అల్లాజీ,వార్డు సభ్యులు మంకీ మహేష్, నాయకులు కంబాల పల్లి అంజి,గురిగళ్ల వీర రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

# డిమాండ్లను పరిష్కరించాలి-లేదంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమం

- ఓయూలో నాన్ టీచింగ్ ఉద్యోగుల రెండో రోజు నిరసన
- 13 యూనివర్సిటీల ఉద్యోగులతో ఐక్య పోరాటానికి సిద్ధం
- ఉద్యోగుల సమస్యలు న్యాయమైనవే ప్రొఫెసర్లు వెంకటదాస్,నతానియల్



**సికింద్రాబాద్, అక్టోబరు 28 (జర్నలిస్ట్ ఫైల్) :** ఉస్మానియా యూనివర్సిటీ నాన్ టీచింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను యూనివర్సిటీ యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ నాన్ టీచింగ్ ఉద్యోగ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే రాష్ట్రంలోని 13 యూనివర్సిటీల నాన్ టీచింగ్ ఉద్యోగులతో కలిసి ఐక్య ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు.ఉస్మానియా యూనివర్సిటీ నాన్ టీచింగ్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) చైర్మన్లు కుమార్, ఖదీర్ ఖాన్ ఆధ్వర్యంలో మంగళవారం వరుసగా రెండో రోజు లంచ్ అవర్ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.యూనివర్సిటీలోని వివిధ విభాగాలు, కళాశాలలకు చెందిన నాన్ టీచింగ్ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు.ఈ నిరసన కార్యక్రమానికి ప్రొఫెసర్లు వెంకటదాస్,నతానియల్ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాన్ టీచింగ్ ఉద్యోగులు లేవనెత్తిన సమస్యలు న్యాయమైనవని,వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత యూనివర్సిటీ యాజమాన్యంపై ఉందని పేర్కొన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ మరింత అభివృద్ధి చెందాలని, విద్యాసంస్థల్లో సానుకూల వాతావరణం నెలకొనాలని తాము కూడా కోరుకుంటున్నామని తెలిపారు.అనంతరం జేఏసీ ప్రతినిధులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రంలోని 13 యూనివర్సిటీల నాన్ టీచింగ్ ఉద్యోగ సంఘాలను సమన్వయం చేసి ఐక్య కార్యాచరణ ప్రకటిస్తామని స్పష్టం చేశారు.

అవసరమైతే అన్ని విశ్వవిద్యాలయాల్లో లంచ్ అవర్ నిరసనలు నిర్వహించి ఉద్యమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామని హెచ్చరించారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి,యూనివర్సిటీల్లో నెలకొన్న సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పవన్,వెంకటేష్, అక్బర్ బేగ్,అప్సర్,నారాయణ,విట్టల్, యాలాల రాజేష్,అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# జోనల్ ఇన్వెస్టిగేషన్ బ్రాంచ్ ఏర్పాటు..

- పోలీస్ స్టేషన్ల పరిధిలో సంక్లిష్ట కేసుల పరిశోధన కోసమే ప్రత్యేక విభాగం..
- గోల్కొండ జోన్‌లో పైలట్ ప్రాజెక్ట్‌గా పారంభించిన నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్




**హైదరాబాద్, అక్టోబరు 28 (జర్నలిస్ట్ ఫైల్) :** హైదరాబాద్ నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీసింగ్ వ్యవస్థలో సరికొత్త సంస్కరణకు శ్రీకారం చుడుతూ 'జోనల్ ఇన్వెస్టిగేషన్ బ్రాంచ్ ' ఏర్పాటైంది. ప్రస్తుతం పోలీస్ స్టేషన్లలో శాంతిభద్రతల పరిరక్షణ (లా అండ్ ఆర్డర్), నేరాల దర్యాప్తు (ఇన్వెస్టిగేషన్) బాధ్యతలను ఒకే సిబ్బంది నిర్వర్తిస్తున్నారు. బందోబస్తులు, నిత్య శాంతిభద్రతల సమస్యల ఒత్తిడి కారణంగా కీలక నేరాల దర్యాప్తుపై పూర్తిస్థాయిలో దృష్టి కేంద్రీకరించడం క్షేత్రస్థాయిలో సవాలుగా మారుతోంది. ఈ నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర పరిశోధన విధులను వేరుచేస్తూ.. తీవ్రమైన, సంక్లిష్టమైన కేసులను పకడ్బందీగా, ఎలాంటి ఆటంకాలు లేకుండా విచారించేందుకు పైలట్ ప్రాజెక్ట్ కింద జోనల్ ఇన్వెస్టిగేషన్ బ్రాంచ్ అనే ప్రత్యేక విభాగాన్ని అందుబాటులోకి తెచ్చారు. మెహిదీపట్నంలోని గోల్కొండ జోన్ డీసీపీ కార్యాలయ ప్రాంగణంలో జోనల్ ఇన్వెస్టిగేషన్ బ్రాంచ్ ను నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, ఐపీఎస్ మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు.

జోన్ పరిధిలో నమోదయ్యే కీలకమైన, గ్రేవ్ కేసులపైనే ప్రత్యేక దృష్టి సారించి నాణ్యమైన దర్యాప్తు చేయడమే లక్ష్యంగా ఇద్దరు డిటెక్టివ్ ఇన్స్పెక్టర్లు, ఒక ఎస్సై, ఒక హెడ్ కానిస్టేబుల్, 10 మంది కానిస్టేబుళ్లతో ఈ ప్రత్యేక ఇన్వెస్టిగేషన్ బృందాన్ని తీర్చిదిద్దారు. ముఖ్యంగా హెల్త్, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్, న్యాయ తదితర కీలక ప్రభుత్వ విభాగాలతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ.. శాస్త్రీయ ఆధారాలతో పకడ్బందీగా సకాలంలో చార్జిషీట్లను దాఖలు చేయడం, తద్వారా నిందితులకు చట్టప్రకారం న్యాయస్థానాల్లో కఠిన శిక్షలు పడేలా చూడటంలో ఈ బృందం కీలక పాత్ర పోషిస్తుంది. సంక్లిష్ట కేసుల పరిశోధన బాధ్యతను ఈ విభాగం తీసుకోవడం వల్ల స్థానిక పోలీస్ స్టేషన్లపై పని ఒత్తిడి గణనీయంగా తగ్గనుంది. ఈ బ్రాంచ్‌ల ఏర్పాటు వల్ల ఒకవైపు నగరంలో శాంతిభద్రతల పరిరక్షణ మరింత పటిష్టం కావడంతో పాటు.. మరోవైపు నేరాల నియంత్రణకు, కేసుల నాణ్యమైన దర్యాప్తునకు రెట్టింపు బలం చేకూరనుంది. గోల్కొండ జోన్‌లో ప్రారంభించిన ఈ పైలట్ ప్రాజెక్ట్ ఫలితాల ఆధారంగా రాబోయే రోజుల్లో నగరంలోని అన్ని జోన్లకూ ఈ సేవలను విస్తరించనున్నారు.

ఈ సందర్భంగా హైదరాబాద్ సీపీ శ్రీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ మాట్లాడుతూ.. బాధితులకు పూర్తిస్థాయిలో సకాలంలో న్యాయం జరిగినప్పుడే పోలీసింగ్ వ్యవస్థకు అసలైన సార్థకత చేకూరుతుందన్నారు. బందోబస్తులు, రోజువారీ పోలీసింగ్ విధుల ప్రభావం కేసుల విచారణపై పడకూడదనే ఏకైక లక్ష్యంతోనే ఈ విభాగాన్ని తీసుకొచ్చినట్లు తెలిపారు. కేసు నమోదు మొదలుకుని న్యాయస్థానంలో చార్జిషీటు దాఖలు చేసేంతవరకు ఈ బృందం పూర్తిగా కేసు పరిష్కారంపైనే ఏకాగ్రత చూపుతుందన్నారు. కమిషనరేట్ పరిధిలో గతంలో ఏర్పాటు చేసిన 'ఇన్వెస్టిగేషన్ మానిటరింగ్ సెల్'కు అనుసంధానంగా జోనల్ లెవెల్‌లో గ్రేవ్ కేసుల విచారణను నిరంతరం పర్యవేక్షించేందుకు ఈ బ్రాంచ్ ఒక బలమైన వెన్నుదన్నుగా నిలుస్తుందని పేర్కొన్నారు. పాత సాంప్రదాయ పద్ధతులతో సరిపెట్టకుండా, ఆధునిక శాస్త్రీయ ఆధారాలను మేళవించినప్పుడే కోర్టుల్లో నేర నిరూపణ సాధ్యమై దోషులకు శిక్షలు పడతాయని చెప్పారు. ఈ నూతన విభాగాల ఏర్పాటుతో పోలీస్ స్టేషన్లలోని సిబ్బందిపై తీవ్రమైన కేసుల దర్యాప్తు భారం గణనీయంగా తగ్గుతుందని, తద్వారా వారి సేవలను క్షేత్రస్థాయిలో శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు మరింత సమర్థవంతంగా వినియోగించుకోవచ్చని స్పష్టం చేశారు. గోల్కొండ జోన్‌లో చేపట్టిన ఈ పైలట్ ప్రాజెక్ట్ ఫలితాల ఆధారంగా కమిషనరేట్ పరిధిలోని మిగతా అన్ని జోన్లలోనూ ఈ బ్రాంచీలను ఏర్పాటు చేయనున్నట్లు సీపీ వెల్లడించారు.

ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో అదనపు సీపీ లా అండ్ ఆర్డర్ తఫ్సీర్ ఇక్బాల్, ఐపీఎస్, గోల్కొండ జోన్ డీసీపీ జి. రాఘవేందర్ రెడ్డి, ట్రాఫిక్ డీసీపీ-1 అవినాశ్ కుమార్, ఐపీఎస్, ట్రాఫిక్ డీసీపీ-2 కాజల్ సింగ్, ఐపీఎస్, మహిళా భద్రతా విభాగం డీసీపీ లావణ్య నాయక్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఖర్గే వ్యాఖ్యలపై వికారాబాద్‌లో బీజేపీ నిరసన

- ఖర్గే దిష్టిబొమ్మ దహనానికి యత్నం.
- ఖర్గే బహిరంగ క్షమాపణ చెప్పాలని బీజేపీ డిమాండ్.



**వికారాబాద్, అక్టోబరు 28 (జర్నలిస్ట్ ఫైల్) :** భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ మంగళవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఎన్టీఆర్ చౌరస్తాలో ఆందోళన చేపట్టారు. పట్టణంలోని ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించి, కాంగ్రెస్ పార్టీకి, ఖర్గేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా మల్లికార్జున్ ఖర్గే దిష్టిబొమ్మను దహనం చేసేందుకు బీజేపీ శ్రేణులు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. దీంతో బీజేపీ కార్యకర్తలకు, పోలీసులకు మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఈ పరిణామంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

ఈ సందర్భంగా వికారాబాద్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు రమేష్ కుమార్ మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని విమర్శించారు. మోదీకి ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకే కాంగ్రెస్ నాయకులు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. దేశ ప్రధానిపై చేసిన వ్యాఖ్యలకు మల్లికార్జున్ ఖర్గే వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ నాయకుల వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో వారికి తగిన బుద్ధి చెబుతారని రమేష్ కుమార్ హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ జిల్లా, పట్టణ స్థాయి నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మణికొండ రహదారి అభివృద్ధి పనులు వేగవంతం..

- మరో 2, 3 రోజుల్లో ట్రైల్స్ విల్లాస్ లింక్ రోడ్డు అందుబాటులోకి!



**మణికొండ, అక్టోబరు 28 (జర్నలిస్ట్ ఫైల్) :** మణికొండ డివిజన్ పరిధిలో రహదారి సమస్యల పరిష్కారం, ట్రాఫిక్ ఇబ్బందుల తగ్గింపే లక్ష్యంగా రహదారి నిర్మాణం, విస్తరణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ట్రైల్స్ విల్లాస్ నుంచి పంచవటి కాలనీ మీదుగా మల్లని చెరువు వైపు వెళ్లే మార్గానికి అనుసంధానంగా చేపట్టిన లింక్ రోడ్డు పనులు పూర్తయ్యాయి. మరో రెండు, మూడు రోజుల్లో ఈ రహదారిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. సుమారు 15 రోజుల క్రితం మణికొండ, నెక్నాంపూర్ డివిజన్ల పరిధిలో పర్యటించిన స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ రహదారి అభివృద్ధి, విస్తరణ పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ట్రైల్స్ విల్లాస్ నుంచి పంచవటి కాలనీ వరకు రహదారి పనులు కొంతమేర పూర్తికావడంతో, మిగిలిన లింక్ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అధికారులు పనులను వేగవంతం చేశారు. ఈ నేపథ్యంలో ట్రైల్స్ విల్లాస్ వద్ద జరుగుతున్న లింక్ రోడ్డు పనుల పురోగతిని మణికొండ మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి, మణికొండ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుద్దోలు శ్రీరాములు, నార్సింగి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏర్పుల కుమార్, నాయకులు శ్రవణ్ కుమార్ తదితరులు పరిశీలించారు. మణికొండ శివాలయం సమీపంలోని విజేత సూపర్ మార్కెట్ నుంచి ఎస్సీ శ్మశానవాటిక మీదుగా చిత్రపురి కాలనీ వరకు నూతన రహదారి నిర్మాణ పనులు కూడా చేపట్టనున్నారు. ఈ పనులు పూర్తయిన అనంతరం రహదారిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు. మణికొండ మర్రిచెట్టు నుంచి హరివిల్లు వరకు రహదారి విస్తరణ పనులను త్వరలో ప్రారంభించేందుకు చర్యలు చేపడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించిన అనంతరం విస్తరణ పనులు చేపట్టనున్నారు. ముఖ్యంగా మర్రిచెట్టు వద్ద వాహనాలు సులభంగా ఫ్రీ లెఫ్ట్ తీసుకునేలా రహదారిని విస్తరించి, ఆ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు ప్రణాళిక రూపొందించారు. ఈ రహదారి అభివృద్ధి పనులు పూర్తయితే మనికొండ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి.

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ..



**మేడ్చల్ అక్టోబరు 28 (జర్నలిస్ట్ ఫైల్) :** పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని పుడూర్--కిష్టాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రొయ్యపల్లి మల్లేష్ గౌడ్ అన్నారు. మంగళవారం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ సర్కిల్ పరిధిలోని పుడూర్--కిష్టాపూర్‌లో ఆయన ఆధ్వర్యంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రేషన్ కార్డుల ద్వారా అర్హులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పేద కుటుంబాలకు చేయూతనందిస్తూ వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు వేముల శ్రీనివాస్ రెడ్డి, కొండల్ రెడ్డి, శేఖర్ గౌడ్, సత్యనారాయణ, జాకట దేవా, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అత్యాధునిక ఆధార్ సేవా కేంద్రం ప్రారంభం

**హైదరాబాద్, అక్టోబరు 28 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వాలకు, పౌరులకు సాంకేతిక సేవలు అందిస్తున్న బీఎల్ఎస్ ఇంటర్నేషనల్ నిర్వహణలో కొత్తగూడెంలో అత్యాధునిక ఆధార్ సేవా కేంద్రం(ఎ.ఎస్.కె)ను జిల్లా కలెక్టర్, మేజిస్ట్రేట్ అంకిత్ ఐఎఎస్ ఇతర ప్రముఖులతో కలిసి ప్రారంభించినట్లు బీఎల్ఎస్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు మంగళవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కేంద్రంలో నాలుగు ఆధార్ కిట్ల ద్వారా కొత్త నమోదు, పేరు, చిరునామా, పుట్టిన తేదీ సవరణలు, బయోమెట్రిక్ వివరాల నవీకరణ తదితర సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. రోజుకు 200 నుంచి 250 మందికి సేవలు అందించే సామర్థ్యంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో వీల్‌చైర్, దివ్యాంగులకు అనుకూలమైన మరుగుదొడ్లు, నిరీక్షణ ప్రాంతం, టోకెన్ వ్యవస్థ, తాగునీరు, ఏసీ తదితర సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ఫిర్యాదుల పరిష్కారం, సందేహాల నివృత్తికి కూడా ప్రత్యేక సహాయం అందించనున్నట్లు తెలిపారు.

# యువ క్రికెటర్లు రాణించి జాతీయ స్థాయికి ఎదగాలి

- అనంతలో ముగిసిన ఆర్డిటి రూరల్ క్రికెట్ టాలెంట్ హంట్ రెండవ దశ అండర్ 15 కార్యక్రమం
- జిల్లా వ్యాప్తంగా 500 మందికి పైగా హాజరు క్రికెట్ చరిత్రలో రికార్డు
- మచ్చా రామలింగారెడ్డిచైర్మన్ ఆర్.డీ.టి క్రికెట్ డెవలప్మెంట్ కమిటీ





**అనంతపురం,అక్టోబరు28(జర్నలిస్ట్ ఫైల్)** యువ క్రికెటర్లు రాబోవు రోజుల్లో క్రికెట్ లో రాణించి రాష్ట్రస్థాయి, జాతీయస్థాయికి ఎదిగి జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని ఆర్డిటి సంస్థ ఇస్తున్న ప్రోత్సాహాన్ని ప్రతి ఒక్క యువ క్రికెటర్ ఉపయోగించుకొని సద్వినియోగం చేసుకోవాలని జిల్లాలో ప్రతిభ ఉన్న యువ క్రికెటర్లను గుర్తించి ప్రోత్సహించాలన్న లక్ష్యంతోనే ఆర్డిటి రూరల్ క్రికెట్ టాలెంట్ కార్యక్రమం జరుగుతున్నదని మచ్చా రామలింగారెడ్డి చైర్మన్ ఆర్డిటి క్రికెట్ డెవలప్మెంట్ కమిటీ అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ముగింపు సమావేశంలో మచ్చ రామలింగారెడ్డి మాట్లాడుతూ అనంతపురం జిల్లాలోని 14 కేంద్రాలలో ఆర్డిటి నిర్వహించిన రూరల్ క్రికెట్ టాలెంట్ హంట్ లో రెండవ దశలో అండర్ 15 విభాగంలో 500 మందికి పైగా క్రికెటర్లు పాల్గొన్నారు వారి ప్రతిభని సెలెక్టర్లు గమనించారని అంతకుముందు నిర్వహించిన మొదటి విడతలో రెండు వేల మంది పైగా యువ క్రికెటర్లు పాల్గొనడం జిల్లా క్రికెట్ చరిత్రలో ఇది ఒక రికార్డ్ అని భవిష్యత్తులో జిల్లాలో యువ క్రికెటర్లకు కొరత లేదని ఈ కార్యక్రమం నిరూపించిందని రాబోవు రోజుల్లో క్రికెట్లో రాణించి జిల్లా క్రీడాకారులు
రాష్ట్రస్థాయి జాతీయస్థాయి రంజీ క్రీడాకారులు కావాలన్నదే ఆర్డిటి మంచో ఫెర్రర్ లక్ష్యం అని అందుకోసం జిల్లాలో ప్రతిభ ఉన్న యువ క్రికెటర్లను గుర్తించే కార్యక్రమాన్ని మంచో ఫెర్రర్ గారు నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని జిల్లాలోని యువ క్రికెటర్లందరూ ఉపయోగించుకున్నారని ఇది ఒక మంచి శుభ పరిణామం అని మచ్చా రామలింగారెడ్డి చైర్మన్ ఆర్డిటి క్రికెట్ డెవలప్మెంట్ కమిటీ అన్నారు. అనంతపురం నగరంలోని ఆర్డిటి క్రీడా గ్రామంలోని క్రీడా మైదానం నందు ఆర్డిటి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం ప్రతిభాన్వేషణ ఎంపికలను నిర్వహించింది. రూరల్ క్రికెట్ టాలెంట్ హంట్ రెండవ దశ అండర్ 15 కార్యక్రమం ముగిసింది ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా, ఆర్డిటి క్రికెట్ అభివృద్ధి కమిటీ చైర్మన్ మచ్చా రామలింగారెడ్డి, సెలెక్టర్లు యోగానంద , విజయ్ రాజు, రాజేశ్వరి, హరినాథ్ రెడ్డి, రఫీ రాజ శేఖర్ ఈనాయతుల్లా ఆర్డిటి గ్రాస్‌రూట్స్ కోఆర్డినేటర్ కె.ప్రవీణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మచ్చా రామలింగారెడ్డి యువ క్రికెటర్లను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఆర్డిటి ఈ నూతన చొరవ తీసుకుందని, ప్రతిభాన్వేషణ కోసం అనంతపురం నగరంలోని చుట్టుపక్క ప్రాంతాల్లో ఉన్నటువంటి యువ క్రీడాకారులు సమావేశమవడం ఆనందంగా ఉందని, ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారి నైపుణ్యాలను మెరుగుపరచడానికి కోచింగ్ శిబిరాలకు పంపుతాము అని తెలిపారు. అనంతపురం నుంచి ప్రతిభ ఉన్న ఎందరో క్రికెటర్లు ఆర్డిటి స్టేడియం ను ఉపయోగించుకొని రంజీ ట్రోఫీ ఆటగాళ్లు కాగలిగారని, టాలెంట్ హంట్ ఎంపికల ద్వారా ప్రతిభావంతులైన ఆటగాళ్లను గుర్తిస్తున్నామని, గ్రామీణ ప్రతిభావంతులైన ఆటగాళ్లకు సరైన క్రికెట్ సౌకర్యాలను వినియోగించుకునేలా చూడటానికి మాజీ భారత, ఆంధ్ర ఆటగాళ్లతో కలిసి ఎన్ సి ఏ, రాష్ట్ర జట్ల శిబిరాల వంటి శిబిరాలను నిర్వహించాలనుకుంటున్నామని మచ్చా రామలింగారెడ్డి అన్నారు. గ్రామీణ ప్రతిభను ప్రోత్సహించి, వారికి మరింత శిక్షణ ఇవ్వడమే మోంచో ఫెర్రర్ లక్ష్యమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డిటి క్రికెట్ కోచ్లు అనంతపురం ఆర్ డి టి కోచ్ ఇనైతుల్లా రఫీ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ ఎంపిక ప్రక్రియలో మొత్తం 90 మంది ఆటగాళ్లు పాల్గొన్నారు.

# భారీ వర్షాల దృష్ట్యా వైద్య ఆరోగ్య శాఖ అత్యవసర అప్రమత్తత

- సిబ్బందికి సెలవులు రద్దు : జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి రామారావు



**ఖమ్మం, అక్టోబరు 28 (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ఈ నెల 28, 29, 30వ తేదీలలో ఖమ్మం జిల్లా వ్యాప్తంగా అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున విపత్తు నిర్వహణ సన్నద్ధతలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ డి. రామారావు ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లాలోని వైద్యాధికారులు, ప్రోగ్రామ్ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందికి జారీ చేసిన ముఖ్య మార్గదర్శకాలను ఆయన వెల్లడించారు. సెలవులు రద్దు, హెడ్‌క్వార్టర్స్‌లోనే ఉండాలని, అక్టోబర్ 27వ తేదీ నుండి వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఎవరికీ ఎలాంటి సెలవులు మంజూరు చేయబడవని, మెడికల్ ఆఫీసర్లు, సూపర్వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఇతర సిబ్బంది అందరూ తప్పనిసరిగా తమ కేటాయించిన హెడ్‌క్వార్టర్స్‌లోనే అందుబాటులో ఉండాలని కోరారు. గర్భిణీలు, తీవ్ర అస్వస్థుల సంరక్షణ, గర్భిణీలు ముఖ్యంగా కాన్పు తేదీ సమీపించిన వారు చిన్న పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని కోరారు. డెలివరీ తేదీ దగ్గర పడిన గర్భిణులను ముందస్తుగానే సురక్షిత ప్రాంతాలకు, సమీప పీహెచ్‌సీలకు, లేదా సురక్షిత నివాసాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మందులు, ప్రథమ చికిత్స కిట్లు, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో సరిపడా అత్యవసర మందులు, ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు, క్లోరినేషన్ మాత్రలు మరియు ప్రథమ చికిత్స కిట్లను సిద్ధంగా ఉంచుకోవాలని, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు, ప్రోగ్రామ్ అధికారుల పర్యవేక్షణ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఖమ్మం, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్తుపల్లి తమ పరిధిలోని ఆరోగ్య కేంద్రాలను నిరంతరం పర్యవేక్షిస్తూ క్షేత్రస్థాయి సిబ్బందికి అవసరమైన ఆదేశాలు జారీ చేయాలని, అలాగే సంబంధిత ప్రోగ్రామ్ అధికారులు అందరూ తమ విభాగాల పరిధిలో తగిన విపత్తు నిర్వహణ చర్యలు చేపట్టాలని,ప్రజల ప్రాణ రక్షణ, అత్యవసర వైద్య సేవల కల్పనలో ఎలాంటి అలసత్వాన్ని సహించేది లేదని, ప్రతి ఒక్కరూ ఈ ఆదేశాలను ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. అత్యవసర వైద్య సహాయం కోసం ప్రజలు సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని లేదా 108/104 సేవలను సంప్రదించాలని కోరారు.

# పట్టభద్రుల ఎమ్ఎల్‌సి ఓటర్ల నమోదును వేగవంతం చేయాలి : మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్





**ఖమ్మం, అక్టోబరు 28 (జర్నలిస్ట్ ఫైల్) :** రాబోయే పట్టభద్రుల ఎమ్ఎల్‌సి ఎన్నికలను పురస్కరించుకుని ఖమ్మం నగరంలో ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పిలుపునిచ్చారు.ఖమ్మం నగరంలో ముస్తఫా నగర్,గాంధీ చౌక్, జిల్లా కోర్ట్, ఎస్ బిఐటి కాలేజ్ వద్ద నిర్వహించిన ఓటర్ల నమోదు కేంద్రాలను మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎమ్మెల్సీ తక్కేళ్లపల్లి రవీందర్ రావు సందర్శించారు.కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్ఎల్‌సి ఎన్నికల నియమాల ప్రకారం గతంలో ఓటు ఉన్నవారు కూడా ఈసారి తప్పనిసరిగా కొత్తగా ఓటు నమోదు చేయించుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. గతంలో ఓటు ఉందనే ధీమాతో ఉండకుండా ప్రతీ పట్టభద్రుడి చేత మళ్లీ దరఖాస్తు పూర్తి చేయించాలని సూచించారు.గత ఎన్నికల డేటా ఆధారంగా డివిజన్ల వారీగా, ఇంటి నంబర్ల వారీగా పట్టభద్రులను గుర్తించి వారికి ఫోన్లు చేసి నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని పార్టీ విభాగాలకు బాధ్యతలు అప్పగించారు. ఫోన్ల ద్వారా అందుబాటులోకి రానివారి ఇళ్లకు నేరుగా వెళ్లి చివరి ప్రయత్నంగా ఓటు నమోదు చేయించాలని కోరారు.పట్టభద్రుల ఎన్నికల్లో లీగల్ సెల్ పాత్ర ఎంతో కీలకమని లీగల్ సెల్ ఓటు ఎన్రోల్మెంట్ కేంద్రం వద్ద న్యాయవాదులు ప్రతి ఒక్కరిని నమోదు చేయించాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థలు మరియు నివాస ప్రాంతాలలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి అర్హులైన ప్రతిఒక్కరి ఓటు నమోదు చేయాలన్నారు. గత మూడేళ్లలో పట్టభద్రులైన నూతన అభ్యర్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఓటర్ల నమోదుకు కేవలం 10 రోజుల సమయం మాత్రమే మిగిలి ఉన్నందున ప్రతీ కార్యకర్త రోజువారీ లక్ష్యాన్ని పెట్టుకుని పనిచేయాలని పిలుపునిచ్చారు. సభలు, మైకులు పెట్టి ఉపన్యాసాలు ఇవ్వడం కంటే ఇటువంటి గ్రౌండ్ లెవల్ (క్షేత్రస్థాయి) వర్క్ మాత్రమే ఎన్నికలలో పార్టీ విజయానికి ఉపయోగపడుతుందని అన్నారు. ఖమ్మం నగర పరిధిలోని అన్ని డివిజన్లలో నమోదు ప్రక్రియ పూర్తయిన తర్వాత డివిజన్ సమన్వయకర్తలు, బాధ్యులతో స్వయంగా మాట్లాడి ఏ డివిజన్‌లో ఎంత నమోదు జరిగిందో సమీక్షిస్తానని తెలిపారు. కార్యకర్తల్లో ఉత్సాహం నింపేందుకు రాబోయే రోజుల్లో స్వయంగా అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు.బిఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటిఆర్ పిలుపు మేరకు నాయకులందరూ క్రియాశీలకంగా పాల్గొని పట్టభద్రుల ఓటర్ల నమోదును జయప్రదం చేయాలని పువ్వాడ అజయ్ కుమార్ కోరారు.కార్యక్రమంలో నాయకులు ఆర్జేసి కృష్ణ, బచ్చు విజయ్ కుమార్, పగడాల నాగరాజు, కర్నాటి కృష్ణ,షేక్ మక్బుల్, పల్లా రోజలీనా, నాగండ్ల కోటేశ్వరరావు, బిక్కసాని జస్వంత్, పసుమర్తి రామ్మోహన్,మాటేటి నాగేశ్వరరావు,బత్తుల మురళి,మెంతుల శ్రీశైలం, లీగల్ సెల్ బిచ్చాల తిరుమల్ రావు,కొత్త వెంకటేశ్వర్రావు, మేకల సుగుణ రావు,శేషు, రామ్మూర్తి,బోజెండ్ల రామ్మోహన్,పాలడుగు పాపారావు,కనకం భద్రయ్య, పాషా,షకీనా,మాటేటి కిరణ్,మోరంపూడి సాయి,సురేష్, గోపి,తౌసిఫ్,ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

# సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ గుగులోత్ రాముకు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బానోతు చంద్రావతి నివాళులు



**అనంతపురం,అక్టోబరు28 (జర్నలిస్ట్ ఫైల్) :** ఏన్కూరు మండలానికి చెందిన సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ గుగులోత్ రాము రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందడం పట్ల వైరా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బానోతు చంద్రావతి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏన్కూరు మాజీ జెడ్పీటీసీ బాలాజీ , మాచినపేట మాజీ ఎంపీటీసీ చిన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు వేగవంతంపై దృష్టి సారించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బానోతు చంద్రావతి





**ఖమ్మం, అక్టోబరు 28 (జర్నలిస్ట్ ఫైల్) :** వైరాలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బానోతు చంద్రావతి సందర్శించి, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమం పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కట్టా కృష్ణార్జునరావు తో ఓటరు నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయడం, అర్హులైన యువ పట్టభద్రులను నమోదు చేసుకునేలా ప్రోత్సహించడం, క్షేత్రస్థాయిలో నమోదు కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించడం వంటి అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు.అర్హులైన ప్రతి పట్టభద్రుడికి ఓటరు నమోదుపై అవగాహన కల్పించి, నమోదు ప్రక్రియలో ఎదురయ్యే ఇబ్బందులను పరిష్కరించేలా సమన్వయంతో కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎద్దునూరి శ్రీను, మద్దెల రవి, బానోతు సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డిని గెలిపించాలి

## : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు





**ఖమ్మం, అక్టోబరు 28 (జర్నలిస్ట్ ఫైల్) :** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి విజయానికి పార్టీ శ్రేణులంతా ఐక్యంగా కృషి చేయాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.
ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డిని ఏఐసీసీ, పీసీసీ ఎంపిక చేయడం మంచి నిర్ణయమని పేర్కొన్నారు. ఉన్నత విద్యావంతుడిగా, రాజకీయ కుటుంబ నేపథ్యం కలిగిన వ్యక్తిగా సర్వోత్తమ రెడ్డి పట్టభద్రుల సమస్యలను అర్థం చేసుకుని పనిచేయగలరని తెలిపారు. ఖమ్మంలో తనను మెజారిటీతో గెలిపించిన విధంగానే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు, పట్టభద్ర ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రతి కార్యకర్త, నాయకుడు గడపగడపకు వెళ్లి అర్హులైన పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించాలని అన్నారు. ఇతర జిల్లాల్లో పార్టీ శ్రేణులు పనిచేస్తున్న తీరుకు అనుగుణంగా ఖమ్మం జిల్లాలోనూ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కష్టపడాలని పిలుపునిచ్చారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డి విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఎన్నికల సన్నాహాల్లో భాగంగా పట్టభద్రుల నమోదు నుంచి ప్రచారం వరకు ప్రతి అంశాన్ని ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్లాలని మంత్రి తుమ్మల తెలిపారు.

## మీ ఓటుతో వైసీపీకి బుద్ధి చెప్పండి



- గుంటూరు నగరాన్ని అన్ని రంగాల్లో నంబర్ వన్ చేస్తాం
- తూర్పులో రూ.400 కోట్లతో అభివృద్ధి, సంక్షేమం
- విద్య, వైద్య రంగాలకు పెద్ద పీట
- మురుగు శాశ్వత పరిష్కారానికి చర్యలు
- కూటమి బలపరిచిన అభ్యర్థులను గెలిపించండి
- డివిజన్లలో ఎమ్మెల్యే నసీర్, మేయర్ అభ్యర్థి లక్ష్మీఅపర్ణ ఎన్నికల ప్రచారం

**గుంటూరు,అక్టోబర్ 28(జర్నలిస్ట్ ఫైల్):** స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థులకు ఓటు వేయడం గుంటూరు నగర అభివృద్ధికి బాటలు పరచడమేనని, మీ ఓటుతో వైసీపీకి బుద్ధి చెప్పాలని తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. బుధవారం స్థానిక డివిజన్లలో 17బి20, 21, 23 కార్పొరేటర్ అభ్యర్థులు షేక్ నయీముద్దీన్, సరస్వతి వెంకట కృష్ణంరాజు, పాలపర్తి సాయివనజ, బత్తుల ప్రసాద్ తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి డివిజన్ లోనూ ప్రజలు కూటమి నేతలకు బ్రహ్మరథం పట్టారు. రెండున్నరేళ్లలో అన్ని వర్గాలకు మేలు జరగడంతో అభివృద్ధిని కొనసాగించేందుకు కూటమి నేతలకు తాము మద్దతుగా నిలుస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగితే ఆర్థిక సంఘ నిధులు మంజూ-రవుతాయని, తద్వారా అభివృద్ధి సాధ్యమవుతుందని, దీనికి అడ్డుకునేందుకు గొడ్డలి కుయుక్తులు పన్నుతోందని ఎమ్మెల్యే నసీర్ మండిపడ్డారు. రాష్ట్రంలో త్వరలో నూతన పింఛన్లు మంజూరు చేయబోతున్నారని, అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించబోతున్నామని తెలిపారు. అర్హులైన ఏ ఒక్కరికైనా సంక్షేమ పథకాలు అందకపోతే వెంటనే తమ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని, ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవలందిస్తామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమికి బలం చేకూర్చడం ద్వారా గుంటూరు నగరంలో మరింత అభివృద్ధి సాధించుకోవచ్చన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఎన్నడూలేని విధంగా అన్నిరంగాల్లో ప్రగతి సాధించామని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమానికి సుమారు రూ.,400 కోట్లు వెచ్చించామన్నారు. మురుగు శాశ్వత పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. అంతర్గత రోడ్లను సైతం సీసీలుగా తీర్చిదిద్దుతున్నామని, గత వైసీపీలో గుంతల రోడ్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని చెప్పారు. కేవలం రోడ్లనే కాకుండా పార్కులు, క్రీడా ప్రాంగణాలు, వాకింగ్ ట్రాక్ నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వంలో రాష్ట్రానికి పరిశ్రమలు తరలివస్తున్నాయని, తద్వారా యువతకు ఉద్యోవకాశాలు పెరుగుతున్నాయని చెప్పారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో విద్యా సంస్కరణలకు నాంది పలికారని, గత పదో తరగతి ఫలితాల్లో స్పష్టంగా తెలిసిందన్నారు. నియోజకవర్గంలో నలుమూలలుగా అభివృద్ధికి పునాదులు వేశామని, దీనిని మరింత కొనసాగించాలంటే కూటమి బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.

## 5న జడ్పిటిసి, ఎంపిటిసి పోలింగ్

**గుంటూరు,అక్టోబర్ 28(జర్నలిస్ట్ ఫైల్):** జడ్పిటిసి, ఎంపిటిసి స్థానాలకు స్థానాలకు నవంబర్ 5వ తేదీన పోలింగ్ జరుగుతుందని, ఏడవ తేదీన లెక్కింపు జరుగుతుందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి సి.యం.సాయికాంత్ వర్మ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఎంపీటీసీ, జడ్పిటిసి ఎన్నికలపై నోటిఫికేషన్ జారీ చేసిందని చెప్పారు. పోలింగ్ ఉదయం ఏడు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతుందని తెలిపారు. ఓట్ల లెక్కింపు ఏడవ తేదీ ఉదయం 8 గంటల నుండి ప్రారంభం అవుతుందని అన్నారు. ఎన్నికల సంఘం మార్పు చేసిన తేదీలను ఓటర్లు గమనించి నవంబరు 5వ తేదీన ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో జడ్పీటీసీ ఎంపీటీసీ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించుటకు అన్ని చర్యలు చేపట్టాలని తెలిపారు. ఇప్పటికే నామినేషన్ ప్రక్రియ పూర్తి అయిందని, ఎన్నికల పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాలను సైతం ప్రకటించడం జరిగిందని చెప్పారు.

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు తియ్యని కబురు 3 శాతం డీఏ పెంపు

- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు డీఏ, డీఆర్ పెంపు
- జూలై 1 నుంచి ఈ పెంపు వర్తింపు

**అమరావతి, అక్టోబర్ 28(జర్నలిస్ట్ ఫైల్):** దీపావళి ముంగిట కోట్లాది మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. ఉద్యోగులకు కరవు భత్యం (డీఏ), పెన్షనర్లకు కరవు సహాయం (డీఆర్)పై కీలక నిర్ణయం తీసుకుంది. బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్.. ఉద్యోగులకు అదనపు డీఏ, పెన్షనర్లకు డీఆర్ విడుదలకు ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఉన్న 60 శాతం బేసిక్ పే/పెన్షన్‌పై అదనంగా 3 శాతం పెంపునకు అంగీకరించింది.
ఈ నిర్ణయంతో ప్రభుత్వ ఖజానాపై ఏటా రూ. 10,016.10 కోట్ల అదనపు భారం పడనుందని కేబినెట్ ఒక ప్రకటనలో వెల్లడించింది. తాజా పెంపు 2026 జూలై 1 నుంచే అమల్లోకి వస్తుంది. పెరిగిన ధరల నుంచి ఉపశమనం కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఈ పెంపుతో మొత్తం డీఏ 63 శాతానికి చేరుతుంది. 7వ కేంద్ర వేతన సంఘం సిఫార్సుల మేరకు ఆమోదించిన ఫార్ములా ప్రకారమే ఈ పెంపు ఉందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయం ద్వారా దేశవ్యాప్తంగా సుమారు 48.54 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 68.71 లక్షల మంది పెన్షనర్లు లబ్ధి పొందనున్నారు.

**8వ వేతన సంఘంపై ఉద్యోగుల ఆశలు**

మరోవైపు, 8వ కేంద్ర వేతన సంఘం వేతనాలు, పెన్షన్లకు సంబంధించిన అంశాలపై ప్రస్తుతం సంప్రదింపులు జరుపుతోంది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి రంజనా ప్రకాశ్ దేశాయ్ నేతృత్వంలోని ఈ కమిషన్‌లో మాజీ ఐఏఎస్ అధికారి పంకజ్ జైన్ (మెంబర్-సెక్రటరీ), ప్రధాని ఆర్థిక సలహా మండలి సభ్యులు పులక్ ఘోష్ సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ సిఫార్సులు కోటి మందికి పైగా ఉద్యోగులు, పెన్షనర్ల ఆర్థిక ప్రయోజనాలపై ప్రభావం చూపనున్నాయి. వీరిలో సుమారు 50 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 65 లక్షల మంది పెన్షనర్లు (రైల్వే, రక్షణ రంగాలతో కలిపి) ఉన్నారు.
తదుపరి వేతన సవరణలో భాగంగా ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌ను అధికంగా నిర్ణయించాలని ఉద్యోగ సంఘాలు కమిషన్‌ను కోరుతున్నాయి. అలాగే, డీఏ ఫ్రేమ్‌వర్క్‌లో మార్పులు చేయాలని, నిర్ణీత పరిమితి దాటిన తర్వాత డీఏను మూల వేతనంలో విలీనం చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ సంప్రదింపుల ద్వారా వచ్చిన అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని కమిషన్ తన సిఫార్సులను రూపొందించనుంది.

# గుంటూరు పశ్చిమంలో టీడీపీలోకి వైసీపీ నేతలు

- ఎమ్మెల్యే గళ్ళా మాధవి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై చేరికలు



**గుంటూరు,అక్టోబర్ 28(జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 31వ డివిజన్‌కు చెందిన పలువురు వైసీపీ నాయకులు ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె వారికి పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.
ఎమ్మెల్యే గళ్ళా మాధవి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై టీడీపీలో చేరినట్లు వారు తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు నాలుగు చక్రాల బండ్ల పంపిణీ, ముస్లిం సోదరుల అంత్యక్రియల కోసం రూ. 15 లక్షల విలువైన వాహనం అందజేత, పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన 55 మంది విద్యార్థులకు ఢిల్లీ విహారయాత్ర వంటి కార్యక్రమాలు తమను ఆకర్షించాయని పేర్కొన్నారు. అలాగే, ప్రతి వారం డివిజన్లలో మెగా వైద్య శిబిరాల నిర్వహణ, మహిళలు, కార్యకర్తలు, ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాలు చేపడుతూ ఎమ్మెల్యే ప్రజలకు అందుబాటులో ఉండటాన్ని అభినందించారు.
టీడీపీలో చేరిన వారిలో.. 1. కుందనాటి సంజయ్ బాబు - ఏకలవ్య ఎరుకల ట్రైబల్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు, వైఎస్సార్‌సిపి ఎస్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి. 2. బెల్లంకొండ శ్రీనివాస్ - వైఎస్సార్‌సీపీ 31వ వార్డు బీసీ సెల్ అధ్యక్షుడు. 3. బొగ్గవరపు ఏసుపాదం - వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు. 4. బొగ్గవరపు సతీష్ బాబు - వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకుడు. 5. వణుకూరి శివరామకృష్ణ ప్రసాద్ - వైఎస్సార్‌సీపీ 31వ వార్డు బీసీ సెల్ కార్యదర్శి. 6. బొమ్మిశెట్టి మధు. 7. గార్లపాటి రమేష్. 8. మామిడాల సత్యనారాయణ తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీయే కూటమి 31వ డివిజన్ అభ్యర్థి గంటా మౌళికతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# అర్నబ్ తుఫాన్‌పై అప్రమత్తమైన గుంటూరు నగరపాలక సంస్థ

- వర్షపు నీరు నిలవకుండా ముందస్తు చర్యలు.. కమిషనర్ మయూర్ అశోక్



**గుంటూరు,అక్టోబర్ 28(జర్నలిస్ట్ ఫైల్):** అర్నబ్ తుఫాన్ ప్రభావంతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా గుంటూరు నగరపాలక సంస్థ అప్రమత్తమైంది. వర్షపు నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి డ్రెయినేజీల్లో అడ్డంకులు తొలగించాలని కమిషనర్ కె. మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. చుట్టుగుంట, పీకలవాగు, కంకరగుంట ఆర్‌యూబీ, ఐటీసీ రోడ్డు, జేకేసీ కాలేజీ రోడ్డు, పట్టాభిపురం, అమరావతి రోడ్డు తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించి పరిస్థితిని పరిశీలించారు.
ప్రధాన డ్రెయిన్లు, నాలాల్లో బ్లాకేజీలు లేకుండా చర్యలు చేపట్టి, అవసరమైన పారిశుధ్య సిబ్బంది, నాలా యంత్రాలు, జేసీబీలను అందుబాటులో ఉంచాలని సూచించారు. వార్డు శానిటేషన్ సిబ్బంది క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని, శిథిల భవనాలను గుర్తించి అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. భారీ హోర్డింగులపై బ్యానర్లను కూడా తొలగించాలని సూచించారు.
వర్షాల సమయంలో ఎదురవుతున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా వార్డుల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కమిషనర్ ఆదేశించారు. తుఫాన్ నేపథ్యంలో నగరపాలక సంస్థ యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని తెలిపారు. ప్రజలకు సమస్యలు ఎదురైతే జీఎంసీ కాల్ సెంటర్ 0863-2345103కు సమాచారం ఇవ్వాలని అధికారులు కోరారు.

# డా. పాటిబండ్ల దక్షిణామూర్తికి ఆలపాటి రాజేంద్రప్రసాద్ నివాళి

**తెనాలి (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రముఖ గుండె వైద్య నిపుణులు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత డా. పాటిబండ్ల దక్షిణామూర్తి అంతిమయాత్రలో బుధవారం శాసన మండలి సభ్యులు, తెనాలి టీడీపీ ఇన్‌చార్జి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. డా. దక్షిణామూర్తి పార్థివదేహంపై పార్టీ జెండా కప్పి ఘనంగా అంతిమ వీడ్కోలు పలికారు.
డా. దక్షిణామూర్తి మృతి పట్ల ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. పార్టీకి, తెనాలి ప్రాంతానికి ఆయన అందించిన సేవలను ఈ సందర్భంగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ స్మరించుకున్నారు.





# క్యాన్సర్ చికిత్స ఇక మరింత చవక..

- 543 మందుల ధరలు తగ్గించిన కేంద్రం..
- నవంబరు 9 నుంచే అమల్లోకి!



**అమరావతి, అక్టోబర్ 28(జర్నలిస్ట్ ఫైల్):** ట్రేడ్ మార్జిన్ల నియంత్రణతో రోగులకు భారీ ఊరట కొన్ని మందుల ధరలు 80 శాతానికి పైగా తగ్గుదల క్యాన్సర్ చికిత్స విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. క్యాన్సర్ చికిత్సలో వినియోగించే 543 బ్రాండ్ల ఔషధాల ధరలను సవరిస్తూ జాతీయ ఫార్మాస్యూటికల్ ధరల నిర్ణయ సంస్థ ఓ ప్రకటన చేసింది. ఈ కొత్త ధరలు నవంబర్ 9 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ నిర్ణయంతో అత్యంత ఖరీదైన కొన్ని క్యాన్సర్ మందుల ధరలు 80% పైగా తగ్గనున్నాయి.
కేంద్ర రసాయనాలు, ఎరువుల మంత్రిత్వ శాఖ పరిధిలోని ఫార్మాస్యూటికల్స్ విభాగం కింద పనిచేసే NPPA, ఈ మేరకు సవరించిన ధరలతో కూడిన జాబితాను విడుదల చేసింది. అక్టోబర్ 17న 137 నాన్-షెడ్యూల్డ్ క్యాన్సర్ మందుల కోసం ట్రేడ్ మార్జిన్ రేషనలైజేషన్ విధానాన్ని ప్రకటించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ విధానం ద్వారా మందుల అమ్మకాలపై ఉన్న అధిక ట్రేడ్ మార్జిన్లకు కళ్లెం వేసి, క్యాన్సర్ చికిత్సను మరింత అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.
ఈ ధరల తగ్గింపు వల్ల రోగులపై ఆర్థిక భారం గణనీయంగా తగ్గనుంది. ఉదాహరణకు, అబాట్ సంస్థకు చెందిన 'బెవాసిజాబ్' 100 ఎమ్జి/4 ఎమ్ఎల్ ఇంజెక్షన్ ధర రూ. 21,767 నుంచి రూ. 5,930కి తగ్గింది. అదేవిధంగా, 'ఫుల్‌వెస్ట్రాంట్' 50 ఎమ్జి ఇంజెక్షన్ ధర రూ. 26,072 నుంచి రూ. 5,491కి దిగివచ్చింది. డాక్టర్ రెడ్డీస్ వారి 'అజాసిటిడిన్' 100 ఎమ్జి ఇంజెక్షన్ ధర రూ. 6,337 నుంచి రూ. 1,495కి తగ్గింది.
ధరలు తగ్గిన ఈ మందుల జాబితాలో 20కి పైగా క్యాన్సర్ రకాల చికిత్సలో వినియోగించే ఇమ్యునోథెరపీ ఔషధాలు ఉన్నాయి. వీటితో పాటు రొమ్ము, ప్రోస్టేట్ క్యాన్సర్ రోగుల కోసం వాడే డెనోసుమాబ్, న్యూట్రోపెనియా నివారణకు ఉపయోగించే పెగ్‌ఫిల్‌గ్రాస్టిమ్, పెద్దప్రేగు, అండాశయ, గర్భాశయ క్యాన్సర్ల చికిత్సలో వాడే బెవాసిజుమాబ్ వంటి కీలకమైన మందులు కూడా ఉన్నాయి. ఔషధ తయారీ కంపెనీలు మంగళవారం వరకు అందించిన సమాచారం ఆధారంగా చీఫ్రా ఈ 543 ఔషధాల జాబితాను రూపొందించింది. మిగిలిన కంపెనీలు కూడా తమ సవరించిన ధరల వివరాలను అందించిన తర్వాత ఈ జాబితాను మరింత విస్తరించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# కృత్రిమ పన్నీరు తయారీ, వాడకంపై ఏడాది పాటు నిషేధం

- గెజిట్ జారీ చేసిన ప్రభుత్వం

**అమరావతి, అక్టోబర్ 28(జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్‌లో కృత్రిమ పన్నీరు తయారీ, నిల్వ, రవాణా, విక్రయాలు, వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం ఏడాది పాటు నిషేధం విధించింది. ప్రజారోగ్య పరిరక్షణ, వినియోగదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆహార భద్రత శాఖ కమిషనర్ జి. వీరపాండియన్ పేరుతో ప్రభుత్వం మంగళవారం గెజిట్ జారీ చేసింది.

**పాలకు బదులుగా నూనెలతో తయారీ:** కృత్రిమ పన్నీరు (అనలాగ్ పన్నీరు) తయారీలో పాలను ఉపయోగించరు. శాఖాహార కొవ్వులు, పామాయిల్ వంటి వంట నూనెలు, మీగడ తీసిన పాలపొడి, ఇతర మిశ్రమ పదార్థాలను ఉపయోగిస్తారు. వీటితో తయారయ్యే పన్నీరు రూపంలో సంప్రదాయ పాల పన్నీరును పోలి ఉంటుంది. అయితే, తయారీ విధానం, ఉపయోగించే ముడి పదార్థాలు, పోషక విలువల్లో తేడాలు ఉంటాయి.

**తక్కువ ధర.. హోటళ్లలో విస్తృత వినియోగం**

సంప్రదాయ పాల పన్నీరుతో పోలిస్తే కృత్రిమ పన్నీరు తయారీ ఖర్చు తక్కువ. మార్కెట్‌లోనూ ఇది తక్కువ ధరకు లభిస్తుంది. ఎక్కువ కాలం నిల్వ ఉండే అవకాశం ఉండటంతో హోటళ్లు, రెస్టారెంట్లు, క్లౌడ్ కిచెన్లలో దీనిని విస్తృతంగా ఉపయోగిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. కొన్ని చోట్ల కృత్రిమ చీజ్‌ను కూడా పన్నీరు పేరుతో వినియోగిస్తున్నట్లు గుర్తించారు.
సంప్రదాయ పన్నీరు పూర్తిగా పాలతో తయారవుతుంది. ఇందులో సహజమైన ప్రొటీన్లు, కాల్షియం ఉంటాయి. అయితే, పాల పన్నీరు తయారీ ఖర్చు ఎక్కువగా ఉండటంతో పాటు ఎక్కువ కాలం నిల్వ ఉండదు. కృత్రిమ పన్నీరు రూపంలో అసలైన పాల పన్నీరును పోలి ఉండటంతో వినియోగదారులు రెండింటి మధ్య తేడాను గుర్తించలేకపోయే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వినియోగదారులకు సరైన సమాచారం అందించడంతో పాటు కృత్రిమ పన్నీరు వినియోగాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం నిషేధ నిర్ణయం తీసుకుంది.

**పన్నీరు స్వచ్ఛతపై అప్రమత్తంగా ఉండాలి: అరుణ్‌బాబు:** పన్నీరు కొనుగోలు చేసేటప్పుడు దాని రంగు, వాసన, మెత్తదనం, వేడి చేసినప్పుడు కలిగే మార్పులను పరిశీలించాలని ఆహార భద్రత శాఖ డైరెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. పన్నీరు నాణ్యతపై అనుమానం కలిగించే లక్షణాలను గమనించాలని, ముఖ్యంగా తక్కువ ధరకు లభించే పన్నీరు ఉత్పత్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

**దేశవ్యాప్తంగా నిషేధానికి చర్యలు**

దేశవ్యాప్తంగా కృత్రిమ పన్నీరు విక్రయాలను నిషేధించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) సూచించినట్లు అధికారులు తెలిపారు.
దీనికి అనుగుణంగా వివిధ రాష్ట్రాలు నిషేధ చర్యలు చేపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా కృత్రిమ పన్నీరు తయారీ, నిల్వ, రవాణా, విక్రయాలు, వినియోగంపై ఏడాది పాటు నిషేధం విధించింది.

## అమరవీరుల త్యాగాలకు ఘన నివాళి



- పోలీసుల రక్తదానం
- రక్తదానం ద్వారా ప్రాణదానం చేయడం అభినందనీయం: ఎస్పీ వకుల్ జిందాల్

**గుంటూరు,అక్టోబర్ 28(జర్నలిస్ట్ ఫైల్):** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకుని గుంటూరు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గుంటూరు పోలీస్ కళ్యాణ మండపంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ శిబిరాన్ని ప్రారంభించగా, సుమారు 40 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేసి అమరవీరుల త్యాగాలకు నివాళులర్పించారు.
రక్తదానం మరొకరి ప్రాణాలను కాపాడే మహత్తరమైన సేవ అని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమైన వారికి ప్రాణదానం చేసే అవకాశం లభించడం సంతోషకరమని పోలీస్ సిబ్బంది తెలిపారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి, తలసేమియా బ్లడ్ బ్యాంక్ వైద్య సిబ్బంది రక్తాన్ని సేకరించారు. శిబిరం నిర్వహణకు సహకరించిన వైద్య సిబ్బందికి ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు.
కార్యక్రమంలో అదనపు ఎస్పీ జీవీ రమణమూర్తి, డీఎస్పీలు అలహరి శ్రీనివాస్, జి. పూర్ణచంద్రరావు, బెల్లం శ్రీనివాసరావు, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఆర్ఐలు సురేష్, హరి రెడ్డి, కృష్ణయ్య, ఆర్ఎస్ఐ సుబ్బారావు, పోలీస్ ఆసుపత్రి ఏఆర్ఎస్ఐ రవి, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## భారీ వర్షంలోనూ ప్రజల్లోకి లక్ష్మీ అపర్ణ



- సాలిపేటలో ఆత్మీయ సమావేశం
- కూటమి అభ్యర్థులకు మద్దతు కోరిన మేయర్ అభ్యర్థి

**గుంటూరు, అక్టోబర్ 28(జర్నలిస్ట్ ఫైల్):** భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఎన్డీఏ కూటమి మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ ఎన్నికల ప్రచారంలో ప్రజలను కలుసుకుంటున్నారు. నగర కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సాలిపేట మొదటి లైన్‌లోని నందూరి కళ్యాణమండపంలో బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు.
ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే తాడిశెట్టి వెంకట్రావు, కార్పొరేటర్ అభ్యర్థి తాడిశెట్టి ఉత్తేజ్‌తో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీ అపర్ణ మాట్లాడుతూ నవంబర్ 1న జరిగే పోలింగ్‌లో ప్రజలు తమ ఓటును సైకిల్ గుర్తుపై వేసి తనను మేయర్ అభ్యర్థిగా, తాడిశెట్టి ఉత్తేజ్‌ను కార్పొరేటర్ అభ్యర్థిగా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.
గుంటూరు నగరంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులకు మరింత ఊతం ఇచ్చేందుకు కూటమి అభ్యర్థులకు ప్రజలు మద్దతు ఇవ్వాలని ఆమె విజ్ఞప్తి చేశారు. నగర అభివృద్ధి కోసం చేపడుతున్న కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగేందుకు తమకు అవకాశం కల్పించాలని కోరారు.
కార్యక్రమంలో అడపా కాశి, వెచ్చా కృష్ణమూర్తి, ఉల్లాస్, మాదా రాధా, కడప సాయి, చల్ల శ్రీనివాసరావు, చి. ఆదినారాయణరావు, ఎం. శంకర్‌రెడ్డి, హేమ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నేపథ్యంలో చెక్‌పోస్టుల వద్ద ఎస్ఎస్‌టీ బృందాల నిఘా



- వర్షంలోనూ నిరంతర వాహన తనిఖీలు
- అక్రమ నగదు, మద్యం రవాణాపై ప్రత్యేక దృష్టి

**గుంటూరు,అక్టోబర్ 28(జర్నలిస్ట్ ఫైల్):** జిల్లాలో జరగనున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నియమావళి అమలుకు పోలీసులు విస్తృత చర్యలు చేపట్టారు. జిల్లావ్యాప్తంగా చెక్‌పోస్టుల వద్ద స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్ (ఎస్ఎస్‌టీ)లు అప్రమత్తంగా ఉంటూ వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు.
ప్రధాన రహదారులు, అంతర్‌జిల్లా సరిహద్దులు, కీలక ప్రాంతాల్లో అనుమానాస్పద వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఎస్పీ పేర్కొన్నారు. ఎన్నికలను ప్రభావితం చేసే అక్రమ నగదు, మద్యం, ఇతర ప్రలోభాల వస్తువుల రవాణాను అడ్డుకునేందుకు తనిఖీలు ముమ్మరం చేసినట్లు తెలిపారు.
వర్షాలు కురుస్తున్నప్పటికీ చెక్‌పోస్టుల వద్ద తనిఖీలకు అంతరాయం లేకుండా సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారని ఎస్పీ తెలిపారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ నగదు, మద్యం లేదా ఇతర వస్తువులను తరలిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు, అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల నిబంధనలు పాటించి ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని కోరారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# పోలింగ్ రోజున అరాచకాలకు కుట్ర.. జగన్‌రెడ్డిపై మంత్రి సత్యకుమార్ ఫైర్



**అమరావతి, అక్టోబర్ 28(జర్నలిస్ట్ ఫైల్):** స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ రోజున పులివెందులలోనే ఉంటానని, ఎవరు వస్తారో చూస్తానంటూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొక్కా మడిచి చేసిన వ్యాఖ్యలపై వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్రంగా స్పందించారు. కడప జిల్లాలో ఎన్నికల పరిస్థితులు పూర్తిగా మారిపోవడంతో సహించలేకే జగన్‌రెడ్డి హింసను రెచ్చగొట్టేలా మాట్లాడుతున్నారని ఆరోపించారు.

నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యే నాటికి కడపలో వైసీపీ పరిస్థితి బలహీనపడటాన్ని జీర్ణించుకోలేక జగన్‌రెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారని మంత్రి విమర్శించారు. తన కుటుంబానికి, పార్టీకి అలవాటైన హింసాత్మక రాజకీయాలను కొనసాగించేందుకు ప్రయత్నించడం దురదృష్టకరమన్నారు. రాష్ట్రప్రయోజనాలను పణంగా పెట్టి రాజకీయ హింసను ప్రోత్సహించడం సమర్థనీయం కాదని స్పష్టం చేశారు.

వైసీపీ అభ్యర్థులు పలుచోట్ల నామినేషన్లు దాఖలు చేసేందుకు ముందుకు రాకపోవడం, నామినేషన్లు వేసిన చోట్ల కూడా వివిధ కారణాలతో తిరస్కరణకు గురయ్యే పరిస్థితులు ఏర్పడటంతో జగన్‌రెడ్డి కూటమి ప్రభుత్వంపై బురదజల్లేందుకు ప్రయత్నించారని సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఎన్నికలను వాయిదా వేయించేందుకు చేసిన ప్రయత్నాలకు సుప్రీంకోర్టు తెరదించిందని, ఈ పరిణామాలను ప్రజలు గమనించారని పేర్కొన్నారు.

నామినేషన్ల సమయంలో ప్యాలెస్‌కే పరిమితమై, ఉపసంహరణల సమయంలో ముఖం చాటేసి, ఎన్నికల ప్రక్రియ అంతా పూర్తయిన తర్వాత చొక్కా మడతపెట్టి సవాలు చేయడంలో ఆంతర్యం ఏమిటని మంత్రి ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ప్రజాస్వామ్యబద్ధంగా పోటీ చేయకుండా ఇప్పుడు హింసాత్మక వాతావరణం సృష్టించేందుకు ప్రయత్నించడం తగదన్నారు.

జగన్‌రెడ్డి పాలనలో ఏకగ్రీవాల కోసం చోటుచేసుకున్న పరిణామాలను ప్రస్తావిస్తూ మంత్రి పలు ప్రశ్నలు సంధించారు. జగన్ పాలనలోనే ఎక్కువ ఏకగ్రీవాలు జరిగాయా, ఇప్పుడా? ఏకగ్రీవాల ద్వారా ప్రజలకు ఎలాంటి సందేశం వెళ్లింది? ప్రజాస్వామ్యానికి నష్టం జరిగింది నాడా.. నేడా? అని ప్రశ్నించారు.

తన పాలనలో జరిగిన ఏకగ్రీవాలను ప్రజాహిత పాలనకు నిదర్శనంగా చెప్పుకున్న జగన్‌రెడ్డి, ఇప్పుడు ఎందుకు ఆందోళన చెందుతున్నారని నిలదీశారు. సొంత కడప జిల్లాలో వైసీపీ నాయకులు నామినేషన్ల దాఖలుకు ఎందుకు వెనుకంజ వేశారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఏకగ్రీవమైన స్థానాల్లోని వైసీపీ నాయకులకు భవిష్యత్తులో అసెంబ్లీ టికెట్లు ఇవ్వబోమంటూ గతంలో చేసిన ప్రకటనకు జగన్‌రెడ్డి ఇప్పటికీ కట్టుబడి ఉంటే పులివెందుల అసెంబ్లీ అభ్యర్థిని ప్రకటించగలరా? అని మంత్రి సవాల్ చేశారు. స్థానిక ఎన్నికలను కూటమి ప్రభుత్వ పాలనపై రెఫరెండంగా భావించాలని చెబుతున్న జగన్‌రెడ్డి, పోటీ చేసిన చోట్ల వైసీపీ ప్రజా తిరస్కారానికి గురైతే తదుపరి అసెంబ్లీ ఎన్నికల నుంచి తప్పుకుంటారా? అని ప్రశ్నించారు.

పోలింగ్ సందర్భంగా హింసను రెచ్చగొట్టేలా మంగళవారం చేసిన వ్యాఖ్యలు, ముందే ఊహించిన అపజయానికి కారణాలు సిద్ధం చేసుకునే కుట్రలో భాగమా? అని సత్యకుమార్ యాదవ్ నిలదీశారు. కూటమి ప్రభుత్వం కృషితో పునరుద్ధరించబడుతున్న రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ను స్వప్రయోజనాల కోసం హింసాత్మక రాజకీయాలతో దెబ్బతీయడం రాష్ట్ర ప్రజలకు శ్రేయస్కరం కాదన్నారు.

తన ఐదేళ్ల పాలనలో ప్రతి ఇంటికీ మేలు చేశానని చెప్పుకునే జగన్‌రెడ్డి, నిజంగా రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోరుకుంటే ఎన్నికల సమయంలో ఎలాంటి హింసకు పాల్పడవద్దని ప్రజలు, పార్టీ శ్రేణులకు స్పష్టమైన పిలుపునివ్వాలని మంత్రి సూచించారు.

తాను సంధించిన ప్రశ్నలకు సమాధానాలపై జగన్‌రెడ్డి లోతుగా ఆత్మపరిశీలన చేసుకోవాలని సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఇప్పటికైనా తన రాజకీయ విధానాలను మార్చుకుని ప్రజాస్వామ్య విలువలను గౌరవించే రాజకీయ నాయకుడిగా రూపాంతరం చెందేందుకు ప్రయత్నించాలని సూచించారు.

## సోషల్ అవేర్‌నెస్ కాదు.. సోషల్ రెస్పాన్సిబిలిటీ ఉండాలి



○ కేంబ్రిడ్జ్ కాలేజీలో విద్యార్థులతో లక్ష్మీ అపర్ణ ఆత్మీయ భేటీ

**గుంటూరు, అక్టోబర్ 28(జర్నలిస్ట్ ఫైల్):** నగర కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎన్డీఏ కూటమి మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ గోరంట్లలోని కేంబ్రిడ్జ్ కాలేజీని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, కళాశాల సిబ్బందితో ఆత్మీయంగా ముచ్చటించారు.

విద్యార్థులు కేవలం సామాజిక స్పృహ కలిగి ఉండటమే కాకుండా, సమాజం పట్ల సామాజిక బాధ్యతను కూడా కలిగి ఉండాలని లక్ష్మీ అపర్ణ సూచించారు. లిలి"సోషల్ అవేర్‌నెస్ కాదు.. సోషల్ రెస్పాన్సిబిలిటీ ఉండాలి"లిలి అని పేర్కొన్నారు. సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను అర్థం చేసుకుని, వాటి పరిష్కారంలో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

విద్యార్థి దశ నుంచే సమాజం పట్ల బాధ్యతాయుతమైన ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవాలని, ప్రజా సమస్యలపై స్పందించే గుణాన్ని పెంపొందించుకోవాలని ఆమె సూచించారు. విద్యతో పాటు సామాజిక బాధ్యత కూడా యువత భవిష్యత్తుకు కీలకమని పేర్కొన్నారు.

టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యాలరావు మాట్లాడుతూ సమావేశానికి హాజరైన ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, పరిచయస్తులకు ఎన్డీఏ కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేయాలని కోరారు. కూటమి అభ్యర్థుల విజయానికి సహకరించాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో కేంబ్రిడ్జ్ కాలేజీ చైర్మన్ సాధినేని నరేంద్రతో పాటు కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇంటర్మీడియట్ ఉర్దూ విద్యార్థులకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్

○ నవంబర్ 1 నుంచి తరగతులు ప్రారంభం



**తాడేపల్లి, అక్టోబర్ 28(జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో ఉర్దూ భాషను అభ్యసిస్తున్న విద్యార్థుల కోసం నవంబర్ 1, 2026 నుంచి ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ తరగతులు నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఉర్దూ ప్రత్యేక అధికారి షేక్ నాగూర్‌వలి తెలిపారు.

ఇంటర్మీడియట్ ఉర్దూ పాఠ్యాంశాలపై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించడంతో పాటు, వారిని పరీక్షలకు సమర్థవంతంగా సిద్ధం చేయడం ఈ ఆన్‌లైన్ కోచింగ్ తరగతుల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకోవడం, ఉర్దూ భాషా నైపుణ్యాలను పెంపొందించడం, పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా అవసరమైన మార్గదర్శకత్వం అందించనున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో ఉర్దూ చదువుతున్న విద్యార్థులందరూ ఈ ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఉర్దూ లెక్చరర్లు తమ కళాశాలల్లోని విద్యార్థులకు ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించి, తరగతుల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేశారు. సంప్రదింపులకు: 9885139827

# అభివృద్ధికి కొనసాగింపే లక్ష్యం

○ ఇన్నర్ రింగ్ రోడ్డులో రావెల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం



**గుంటూరు, అక్టోబర్ 28(జర్నలిస్ట్ ఫైల్):** నగర కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డులో రావెల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎన్డీఏ కూటమి మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ, టీడీపీ మీడియా కోఆర్డినేటర్ దారపునేని నరేంద్ర, జిల్లా టీడీపీ అధ్యక్షుడు పిల్లి మాణిక్యాలరావు, రావిపాటి సాయి, వజ్జ రామకృష్ణ తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా జిల్లా టీడీపీ అధ్యక్షుడు పిల్లి మాణిక్యాలరావు మాట్లాడుతూ గుంటూరు నగర కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందన్నారు. వర్ష ప్రభావం ఉన్నప్పటికీ మేయర్ అభ్యర్థి లక్ష్మీ అపర్ణ ప్రజల్లోకి వెళ్లి విస్తృతంగా ప్రచారం నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రజల ఆదరణతో కూటమి అభ్యర్థులు విజయం సాధిస్తారనే ధీమా వ్యక్తం చేశారు.

సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్ అభ్యర్థులు నగర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణతో పాటు కూటమి కార్పొరేటర్ అభ్యర్థులకు తమ ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు.

కోవెలమూడి లక్ష్మీ అపర్ణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో మద్దతు ఇస్తున్న టీడీపీ, బీజేపీ, జనసేన కుటుంబ సభ్యులకు, నగర ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు.

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యేలు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు కొనసాగింపుగా గుంటూరు నగరంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. గత 11 నెలల్లో నాని నాయకత్వంలో కొనసాగిన అభివృద్ధి కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లి, నగర ప్రజలకు స్పష్టంగా కనిపించేలా పనులు చేపడతామని పేర్కొన్నారు. ప్రజలు తనపై చూపుతున్న ఆదరణకు రెట్టింపు స్థాయిలో పనిచేస్తూ గుంటూరు నగర అభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

టీడీపీ మీడియా కోఆర్డినేటర్ దారపునేని నరేంద్ర మాట్లాడుతూ కూటమికి మద్దతు తెలుపుతున్న నగర ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతికూల వాతావరణంలోనూ ప్రజలు పెద్ద సంఖ్యలో సమావేశానికి హాజరై తమ మద్దతు చాటడం సంతోషకరమన్నారు.

కార్యక్రమంలో రావిపాటి సాయి, వజ్జ రామకృష్ణతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## పులివెందులలో వైసీపీకి ఎదురుదెబ్బ.. టీడీపీలోకి 20 కుటుంబాలు

**అమరావతి, అక్టోబర్ 28(జర్నలిస్ట్ ఫైల్):** స్థానిక ఎన్నికలకు కొన్ని రోజుల ముందు వైసీపీకి షాక్ తగిలింది. వైసీపీ అధినేత జగన్ సొంత గడ్డ పులివెందులకు చెందిన 20 వైసీపీ కుటుంబాలు ఈరోజు పులివెందుల టీడీపీ ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి వారికి పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ... టీడీపీ విధానాలు, కార్యక్రమాలకు ఆకర్షితులై నియోజకవర్గంలో పెద్ద సంఖ్యలో యువత పార్టీలో చేరుతున్నారని అన్నారు. ఎన్నికలకు కేవలం కొన్ని రోజుల సమయం మాత్రమే ఉన్నప్పటికీ, పులివెందులలోని ప్రతి వార్డులో ప్రజలు టీడీపీ వైపు మొగ్గు చూపుతున్నారని, మద్దతుదారుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోందని పేర్కొన్నారు.

ఈ ఎన్నికల్లో టీడీపీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ అభ్యర్థిగా బరిలో ఉన్న గీతా కుమారి భారీ మెజారిటీతో గెలుపొందడం ఖాయమని బీటెక్ రవి ధీమా వ్యక్తం చేశారు. కీలకమైన ఎన్నికల సమయంలో ఈ చేరికలు జరగడం నియోజకవర్గంలో రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

## తుఫాన్‌తో నష్టపోయిన రైతులకు అండగా ఉంటాం



○ జంపని-వేమూరు మధ్య నేలకొరిగిన వరి పంట పొలాల పరిశీలన

○ వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు

**వేమూరు, అక్టోబర్ 28(జర్నలిస్ట్ ఫైల్):** అర్నబ్ తుఫాన్ ప్రభావంతో జంపని-వేమూరు గ్రామాల మధ్య నేలకొరిగిన వరి పంట పొలాలను వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటను పరిశీలించి రైతులతో మాట్లాడి నష్టాల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా నక్కా ఆనందబాబు మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో పంట నష్టపోయిన రైతులు అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు. కష్టకాలంలో రైతులకు అండగా ఉంటామని, నష్టపోయిన పంటలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టం అంచనాలను నమోదు చేయాలని సూచించారు.

రైతులకు అవసరమైన సహాయం అందేలా ప్రభుత్వ దృష్టికి సమస్యలను తీసుకెళ్లి చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

## జోరువానలోనూ గాయత్రి ప్రచారం



○ 43వ డివిజన్‌లో ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకున్న బీజేపీ అభ్యర్థి

**గుంటూరు, అక్టోబర్ 28(జర్నలిస్ట్ ఫైల్):** 43వ డివిజన్‌లో ఎన్డీఏ కూటమి బలపరిచిన బీజేపీ కార్పొరేటర్ అభ్యర్థి రంగావజ్జుల గాయత్రి జోరుగా వర్షం కురుస్తున్నప్పటికీ బ్రాడీపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ స్థానికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాల కారణంగా డివిజన్‌లో ఎదురవుతున్న ఇబ్బందులపై స్థానికులు గాయత్రి దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా డ్రైనేజీ సమస్యలు, తాగునీటి ఇబ్బందులు, పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని గాయత్రి హామీ ఇచ్చారు. డివిజన్‌లో వీధి దీపాలను ఎల్ఈడీ బల్బులుగా మార్చడం ద్వారా ప్రజలకు మెరుగైన వెలుతురు అందుతోందని ఆమె తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు అండగా నిలవాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో కార్పొరేటర్ అభ్యర్థిగా తనకు కమలం గుర్తుపై, మేయర్ అభ్యర్థికి సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని గాయత్రి విజ్ఞప్తి చేశారు. డివిజన్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రచార కార్యక్రమంలో హరిపావని, హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ మహిళా కోఆర్డినేటర్ మన్నవ అరుణ, భూలక్ష్మి, పాలపాటి రవికుమార్, హనుమ ప్రసాద్, పాపయ్య, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆర్నాబ్ తుఫానుతో రైతులకు తీవ్ర నష్టం.. ఆదుకోవాలని కేంద్రానికి మంత్రి అచ్చెన్నాయుడు లేఖ

- ○ రాష్ట్రంలో 2.24 లక్షల హెక్టార్లలో నీటమునిగిన, దెబ్బతిన్న పంటలు
- ○ 14 జిల్లాల్లో సుమారు 3.45 లక్షల మంది రైతులపై తుఫాను ప్రభావం
- ○ ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ నిబంధనల మేరకు పెట్టుబడి రాయితీ అందించాలని విజ్ఞప్తి
- ○ సమగ్ర నష్ట నివేదిక అందేలోపే ముందస్తుగా కేంద్ర నిధులు విడుదల చేయాలని అభ్యర్థన



**అమరావతి, అక్టోబర్ 28(జర్నలిస్ట్ ఫైల్) :** ఆర్నాబ్ అత్యంత తీవ్ర తుఫాను కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ, ఉద్యాన పంటలకు భారీ నష్టం వాటిల్లే పరిస్థితులు ఏర్పడ్డాయని, కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, పాడిపరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు బుధవారం లేఖ రాశారు. తుఫాను ప్రభావంతో రాష్ట్రంలోని 14 జిల్లాల్లో 2,24,489 హెక్టార్లలో పంటలు నీటమునగడం లేదా దెబ్బతినడంతో సుమారు 3.45 లక్షల మంది రైతులు ప్రభావితమైనట్లు ప్రాథమిక నివేదికల ద్వారా వెల్లడైందని తెలిపారు. పంటలు చేతికందే కీలక సమయంలో ప్రకృతి విపత్తు సంభవించడం రైతాంగానికి తీవ్ర ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. అక్టోబర్ 28 తెల్లవారుజామున యానాంకు దక్షిణంగా ఆంధ్రప్రదేశ్--యానాం తీరాన్ని దాటిన ఆర్నాబ్ తుఫాను గంటకు 125 నుంచి 135 కిలోమీటర్ల వేగంతో గాలులు, గరిష్ఠంగా 150 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులకు కారణమైందని మంత్రి వివరించారు. తీరం దాటే సమయంలో తుఫాను దాదాపు స్థిరంగా కొనసాగడంతో కృష్ణా నుంచి శ్రీకాకుళం వరకు పలు తీరప్రాంత జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయన్నారు. రాష్ట్రంలోని 688 మండలాలకు గాను 317 మండలాల్లో 10 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదైందని, శ్రీకాకుళం నుంచి బాపట్ల వరకు విస్తరించిన 16 జిల్లాల్లోని 325 మండలాల్లో 315 మండలాలు ఈ పరిధిలో ఉన్నాయని తెలిపారు. విశాఖపట్నం జిల్లాలో సగటున 236.7 మి.మీ., విజయనగరంలో 212.1 మి.మీ., అనకాపల్లిలో 209.2 మి.మీ. వర్షపాతం నమోదు కాగా, విశాఖ జిల్లా గోపాలపట్నంలో అత్యధికంగా 323.2 మి.మీ. వర్షం కురిసిందని పేర్కొన్నారు. గోదావరి, కృష్ణా డెల్టా ప్రాంతాల్లోనూ భారీ వర్షాల కారణంగా పంటలు నీటమునిగాయని వివరించారు.

**వరి పంటకే అత్యధిక ప్రభావం..డెల్టా రైతులకు తీవ్ర నష్టం :** ప్రాథమిక అంచనాల ప్రకారం 154 మండలాల్లో 2,11,726 హెక్టార్ల వ్యవసాయ పంటలు నీటమునగడం లేదా దెబ్బతినగా, ఇందులో వరి విస్తీర్ణమే 2,09,460 హెక్టార్లు ఉందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. వ్యవసాయ పంటలకు సంబంధించి 3,18,704 మంది రైతులు, ఉద్యాన పంటలకు సంబంధించి మరో 25,914 మంది ప్రభావితమయ్యారని పేర్కొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 76,176 హెక్టార్లు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమలో 44,232, కాకినాడలో 42,222, తూర్పుగోదావరిలో 29,866, కృష్ణాలో 22,339, బాపట్లలో 4,032 హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యాన పంటలు ప్రభావితమైనట్లు వివరించారు. అలాగే విజయనగరంలో 1,967 హెక్టార్లు, అనకాపల్లిలో 1,624, గుంటూరులో 570, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 422, శ్రీకాకుళంలో 374, పోలవరంలో 310, ఏలూరులో 274, విశాఖపట్నంలో 81 హెక్టార్లలో పంటలు నీటమునగడం లేదా దెబ్బతిన్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా పశ్చిమ గోదావరి జిల్లాలో సుమారు 82 శాతం, కోనసీమలో 75 శాతం, కాకినాడలో 48 శాతం వరి విస్తీర్ణం నీటమునిగినట్లు నివేదికలు సూచిస్తున్నాయని తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో వరి గింజ దశ నుంచి కోత దశకు చేరుకున్న తరుణంలో తుఫాను సంభవించడంతో పంటలు నేలకొరగడం, ధాన్యం మొలకెత్తడం, రంగు మారడం వంటి సమస్యలు తలెత్తే ప్రమాదముందన్నారు. ఇప్పటికే కోసిన ధాన్యానికి సైతం నష్టం వాటిల్లే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు.

**అరటి, కొబ్బరి, కూరగాయల పంటలకూ తీవ్ర దెబ్బ :** రాష్ట్రవ్యాప్తంగా 12,763 హెక్టార్లలో ఉద్యాన పంటలు ప్రభావితమయ్యాయని మంత్రి పేర్కొన్నారు. బలమైన గాలులకు అరటి తోటలు నేలకొరిగాయని, ముఖ్యంగా గెలలు వేసి కోతకు సిద్ధంగా ఉన్న మొక్కలు విరిగిపోవడం లేదా వేళ్లతో సహా కూలిపోవడంతో రైతులకు గణనీయమైన నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడిందన్నారు. కూరగాయల తోటల్లో నీరు నిలిచిపోవడం వల్ల మొక్కలు వాడిపోవడం, వేర్లు కుళ్లిపోవడం వంటి సమస్యలు ఉత్పన్నమయ్యే ప్రమాదముందని తెలిపారు. పశ్చిమ గోదావరి, కోనసీమ జిల్లాల్లో కొబ్బరి తోటల్లో మట్టలు విరిగిపోవడం, పిందెలు, కాయలు రాలిపోవడంతో పాటు కొన్ని ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయని వివరించారు. బొప్పాయి, పూలు, తమలపాకు తోటలకు కూడా నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక సమాచారం అందిందన్నారు.

**వర్షాలు తగ్గిన వెంటనే సంయుక్త క్షేత్రస్థాయి పరిశీలన :** ప్రస్తుతం అందుబాటులో ఉన్న గణాంకాలు ప్రాథమికమైనవేనని, వర్షాలు తగ్గి వరద నీరు పూర్తిగా తొలగిన తర్వాతే వాస్తవ పంట నష్టాన్ని నిర్ధారించగలమని మంత్రి స్పష్టం చేశారు. వ్యవసాయ, ఉద్యానవన, రెవెన్యూ శాఖల అధికారులు ప్రభావిత గ్రామాల్లో సంయుక్తంగా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించి నష్టాన్ని అంచనా వేస్తారని తెలిపారు. ఆ వివరాలతో సమగ్ర నివేదికను కేంద్రానికి సమర్పిస్తామన్నారు. వర్షాలు, బలమైన గాలులు కొనసాగుతున్న నేపథ్యంలో నష్టం మరింత పెరిగే అవకాశముందని పేర్కొన్నారు. తుఫాను ముప్పును ముందుగానే గుర్తించి రైతులను అప్రమత్తం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పంటల వారీగా 1.05 కోట్లకు పైగా ముందస్తు సూచనలు జారీ చేసిందని మంత్రి అచ్చెన్నాయుడు వివరించారు. రైతు సేవా కేంద్రాల సిబ్బందిని క్షేత్రస్థాయిలో అప్రమత్తం చేసి, పంటల సంరక్షణకు అవసరమైన జాగ్రత్తలను తెలియజేయడంతో పాటు రైతులకు సహాయ సహకారాలు అందించేలా చర్యలు చేపట్టామన్నారు. ప్రకృతి విపత్తుల సమయంలో పంట నష్టాన్ని తగ్గించడం, రైతుల జీవనోపాధిని కాపాడటమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని తెలిపారు.

**కేంద్రం తక్షణమే స్పందించాలి.. ముందస్తు నిధులు విడుదల చేయాలి :** తుఫాను కారణంగా రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన నిధి నిబంధనల మేరకు నష్టపోయిన రైతులకు పెట్టుబడి రాయితీ అందించేందుకు కేంద్ర సహాయం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమగ్ర నష్ట నివేదిక సమర్పణకు ముందే అత్యవసర సహాయక చర్యల కోసం ముందస్తుగా నిధులు విడుదల చేయాలని అభ్యర్థించారు.

సకాలంలో ఆర్థిక సహాయం అందితే రైతుల కష్టాలను కొంతవరకు తగ్గించడంతో పాటు వారి జీవనోపాధిని పరిరక్షించేందుకు, రాష్ట్రప్రభుత్వం అవసరమైన సహాయక, పునరుద్ధరణ చర్యలను వేగవంతం చేసేందుకు వీలవుతుందని వివరించారు. ఈ విషయంలో కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ వ్యక్తిగతంగా చొరవ తీసుకుని ఆంధ్రప్రదేశ్ రైతాంగానికి అండగా నిలవాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తన లేఖలో కోరారు.

## తుఫాను ప్రభావం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

○ గుంటూరు నగర ప్రజలకు మేయర్ అభ్యర్థి విజ్ఞప్తి



**గుంటూరు, అక్టోబర్ 28(జర్నలిస్ట్ ఫైల్):** అర్నబ్ తుఫాను ప్రభావం నేపథ్యంలో గుంటూరు నగర ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కూటమి మేయర్ అభ్యర్థి శ్రీమతి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ విజ్ఞప్తి చేశారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రజలు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. భారీ వర్షాలు కురిసే సమయంలో అత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లవద్దని, విద్యుత్ స్తంభాలు, చెట్లు, హోర్డింగుల సమీపంలో ఉండవద్దని కోరారు. సిటీ చివర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాతావరణ శాఖ, ప్రభుత్వ అధికారుల సూచనలను పాటించాలని తెలిపారు. ప్రజల భద్రతే అత్యంత ముఖ్యమని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తూ తమ కుటుంబ సభ్యుల క్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆమె పేర్కొన్నారు.

Owned, Edited & Published by D.Ajay. Published from 126-352, 4Th Lane, Kodandarama Nagar, Gorlavaripalem Road, Gorantla, Guntur-522034 (A.P).
Printed by C.Sridhar Reddy at Teja Cards and Stationery, Shop no.1, 22-11-170, T.V Street, Lalapet,Guntur-522003(A.P.). Editor : D.Ajay. Phones: 7661805968, 9966319999. Email: dasariajjay@gmail.com